


TELANGANA VANI TELUGU DAILY R N I No. APTEL/2012/53127

# తెలంగాణ వాణి

తెలుగు దినపత్రిక




సంపుటి: 16 | సంచిక : 90 | ఆదివారం 26. 7. 2026 | ఎడిటర్: జేరిపోతుల సంపత్ | కరీంనగర్ | పేజీలు 8 | వెల: 5.00




- తన రాజీనామా లేఖను ప్రధాని నరేంద్ర మోదీకి..
- నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై దేశవ్యాప్తంగా విద్యార్థుల ఆందోళనలు
- తన రాజీనామా లేఖను ప్రధాని నరేంద్ర మోదీకి..
- ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో సుదీర్ఘ పోస్టు
- ప్రధాన్ స్పందిస్తూ.. యువత ఆకాంక్షలను తాను గౌరవిస్తున్నట్లు ప్రకటన
- "గత పది రోజులుగా జరుగుతున్న పరిణామాలు నన్ను బాధించాయి.
- నేను వ్యక్తిగత భేషజాలకు పోవడం లేదు.
- నీట్ అక్రమాలు వెలుగులోకి రాగానే.. సీబీఐ విచారణకు ఆదేశించాం.
- విజయవంతంగా మళ్లీ పరీక్షను నిర్వహించాం.
- బాధ్యతల నుంచి నేను ఎప్పుడూ తప్పుకోలేదు.
- యువశక్తే.. ఈ దేశ అసలైన శక్తి. వారి భవిష్యత్తు కోసమే రాజీనామా
- దేశ యువతపై నాకు పూర్తి నమ్మకం ఉంది. వారి ఆకాంక్షలను గౌరవిస్తున్నా.
- దేశ విద్రోహ శక్తులకు అవకాశం ఇవ్వకూడదనే రాజీనామా నిర్ణయం తీసుకున్నా.
- దేశ సేవ నా అత్యున్నత ప్రాధాన్యత. దేశ ఐక్యత కొనసాగాలి.
- యువత తమ చదువుల కోసమే సమయం కేటాయించాలి.
- మంత్రిగా ఇన్నాళ్లు నాకు అవకాశం కల్పించిన మోదీకి కృతజ్ఞతలు"

హైదరాబాద్ తెలంగాణ వాణి)
నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై దేశవ్యాప్తంగా విద్యార్థుల ఆందోళనలు కొనసాగుతున్న వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను ప్రధాని నరేంద్ర మోదీకి పంపారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో సుదీర్ఘ పోస్టు పెట్టారు. ఈ సందర్భంగా ప్రధాన్ స్పందిస్తూ.. యువత ఆకాంక్షలను తాను గౌరవిస్తున్నట్లు తెలిపారు. "గత పది రోజులుగా జరుగుతున్న పరిణామాలు నన్ను బాధించాయి. నేను వ్యక్తిగత భేషజాలకు పోవడం లేదు. నీట్ అక్రమాలు వెలుగులోకి రాగానే.. సీబీఐ విచారణకు ఆదేశించాం. విజయవంతంగా మళ్లీ పరీక్షను నిర్వహించాం. బాధ్యతల నుంచి నేను ఎప్పుడూ తప్పుకోలేదు. యువశక్తే.. ఈ దేశ అసలైన శక్తి. వారి భవిష్యత్తు కోసమే రాజీనామా చేశాను. దేశ యువతపై నాకు పూర్తి నమ్మకం ఉంది.

## ఏ ప్రభుత్వమైనా తప్పు జరిగితే తలవంచాల్సిందే..



'విద్యా వ్యవస్థను సరిదిద్దడం కోసం దేశవ్యాప్తంగా లక్షలాది మంది యువత ధైర్యంగా పోరాడారు. ప్రధాన్ రాజీనామాతో విద్యార్థులు, అవినీతి ప్రభుత్వం కారణంగా తమ పిల్లలను కోల్పోయిన కుటుంబాలు, యువత తరఫున పార్లమెంట్‌లో గళం విప్పిన ప్రతిపక్షాలు విజయం సాధించాయి' ఏ ప్రభుత్వమైనా తప్పు జరిగితే ప్రజల ముందు తలవంచాల్సిందేనన్నారు.

-కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే



'ఇది ప్రజాస్వామ్య విజయం. వీధుల నుంచే నేరుగా వచ్చిన ప్రత్యక్ష ప్రజాస్వామ్యం ఇది. శాంతి, సహనం, పట్టుదలకు దక్కిన విజయమిది. భయాన్ని వీడి దేశంలోని నలుమూలల నుంచి కదిలి వచ్చిన పౌరులందరికీ కృతజ్ఞతలు. కాక్రోచ్ జనతా పార్టీ నేతలకు అభినందనలు'

- సోనమ్ వాంగ్‌చుక్



కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడాన్ని కాంగ్రెస్ అగ్రనేత, ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ స్వాగతించారు. నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీ, విద్యావ్యవస్థలోని లోపాలపై దేశవ్యాప్తంగా విద్యార్థులు చేపట్టిన ఉద్యమానికి లభించిన విజయంగా దీనిని ఆయన అభివర్ణించారు. దేశంలోని విద్యావ్యవస్థ పునర్నిర్మాణంలో ఇది తొలి అడుగుగా భావిస్తున్నానని ఈ సందర్భంగా రాహుల్ గాంధీ పేర్కొన్నారు. అన్యాయానికి వ్యతిరేకంగా వీధుల్లోకి వచ్చి ధైర్యంగా పోరాడిన యువతకు, విద్యార్థులకు ఆయన ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. దేశవ్యాప్తంగా విద్యార్థులు చూపిన పట్టుదల, ఐక్యతను చూసి ఎంతో గర్విస్తున్నానని, వారి ఉద్యమ స్ఫూర్తి ప్రశంసనీయమని కొనియాడారు. ఈ నిర్ణయంతోనైనా దేశ విద్యావ్యవస్థలో పారదర్శకమైన, సమూలమైన సంస్కరణలు వస్తాయని ఆశిస్తున్నట్లు ఆయన వ్యాఖ్యానించారు. అయితే.. విద్యాశాఖ మంత్రి రాజీనామాతోనే సమస్య ముగిసిపోలేదని, తమ ముందు మరికొన్ని కీలక డిమాండ్లు మిగిలే ఉన్నాయని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు.



నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారంలో దేశవ్యాప్తంగా నిరసనలు తీవ్రరూపం దాల్చిన నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ శనివారం తన పదవికి రాజీనామా సమర్పించిన సంగతి తెలిసిందే. ఈ పరిణామంపై అరవింద్ కేజ్రీవాల్ స్పందించారు. ధర్మేంద్ర ప్రదాన్ రాజీనామా చేసినందుకు దేశ ప్రజలందరికీ నా అభినందనలు. ఇది ప్రజాస్వామ్యానికి దక్కిన పెద్ద విజయం అని తెలిపారు. ఈమేరకు ఇవాళ ఓ వీడియోను ఆయన విడుదల చేశారు. నిరసన సమయంలో విద్యార్థులు కొనసాగించిన కృషిని ప్రశంసించిన కేజ్రీవార్ యువతకు, జెన్ జీని అభినందనలు తెలిపారు. ఇంత పెద్ద ఆందోళన తర్వాత ప్రజల ఉద్యమంతో ప్రభుత్వం అహంకారం బద్ధలైందని ఇది ప్రజాస్వామ్యానికి పెద్ద విజయం అన్నారు. ఇకపైనా ప్రభుత్వం ప్రజల మాటలను వినడం అలవాటు చేసుకోవాలన్నారు.




## 45 రోజులకోసారి మండల ప్రజాపరిషత్ సమావేశాలు..

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఉత్తర్వులు జారీ
- ఇటీవల పంచాయతీరాజ్ శాఖపై సమీక్ష సందర్భంగా సీఎం ఆదేశాలు
- ప్రజాపరిషత్ సమావేశాల్లో సర్పంచులు, మండల స్థాయి అధికారులు పాల్గొనాలని స్పష్టం
- తక్షణమే అమలు చేయాలని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్‌ను, జిల్లాల కలెక్టర్లను ప్రభుత్వం ఆదేశం




## అధికారంలో ఉన్నవారి కంటే ప్రజల శక్తి ఎప్పుడూ గొప్పది

- మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- పరీక్ష పే చర్చ పెట్టిన మీరు పేపర్ లీకేజీలపై ఎందుకు పెట్టలేదు?
- ఏటా 2 కోట్ల ఉద్యోగాల హామీ ఏమైంది?'
- ఢిల్లీలో పిల్లలపై దాడులను చూస్తుంటే ఇద్దరు పిల్లల తండ్రినైన తన మనస్సు చలించిపోయింది
- మోదీ, రేవంత్ ప్రభుత్వాలపై తనదైన శైలిలో పంచులు విసిరారు
- ఢిల్లీలో యువతపై మోదీ సర్కార్ సాగిస్తున్న దమనకాండను కండ్లకుకట్టారు.

## రియల్ ఎస్టేట్ పడిపోలేదు.. గతం కంటే పెరిగింది

- రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- స్టాంప్స్ ు రిజిస్ట్రేషన్ శాఖ మంత్రిగా స్పష్టమైన ఆధారాలు, వివరాలు ఉన్నాయి
- గత రెండున్నర సంవత్సరాల ప్రజా ప్రభుత్వ పాలనలో సుమారు 15 నుంచి 20 శాతం రియల్ ఎస్టేట్ అభివృద్ధి
- గడిచిన పదేళ్లతో పోలిస్తే ఈ రెండున్నర ఏళ్లలో రెసిడెన్షియల్ మార్కెట్ విశేషంగా పెరిగింది
- రియల్ ఎస్టేట్ పడిపోయిందని కొంతమంది పనిగట్టుకొని ఈ ప్రభుత్వంపై బురద చల్లేందుకు ఈ గోబెల్స్ ప్రచారం
- 2004 నుంచి 2014 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నాటి కాంగ్రెస్ ముఖ్యమంత్రుల చొరవ కారణంగానే హైదరాబాద్ ఒక రోల్ మోడల్



## ఆందోళన విరమించిన సీజేపీ

### నీట్ లీకేజీ వ్యవహారానికి బాధ్యత వహిస్తూ ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా

- ప్రధాన డిమాండ్ నెరవేరడంతోపాటు, మిగతా వాటినీ నెరవేర్చేందుకు కేంద్రం అంగీకారం
- నిరసనలు విరమిస్తున్నట్లు సీజేపీ ప్రకటన
- కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్‌తో కలిసి సీజేపీ ప్రతినిధులు సమావేశం
- నిరసనకారులపై నమోదైన కేసులను కొట్టివేయాలి
- 'నాలుగు రోజుల్లో కేసులు విత్‌డ్రా చేస్తామని కేంద్రం హామీ
- భవిష్యత్‌లోనూ కేసులతో వేధించబోమని స్పష్టత
- నీట్ లీక్ వల్ల ఆత్మహత్య చేసుకున్న కుటుంబాలకు పరిహారం
- భవిష్యత్‌లో ఎవరినీ కేసులతో వేధించబోము.




హైదరాబాద్ తెలంగాణ వాణి)
నీట్ లీకేజీ వ్యవహారానికి బాధ్యత వహిస్తూ ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్న ప్రధాన డిమాండ్ నెరవేరడంతోపాటు, మిగతా వాటినీ నెరవేర్చేందుకు కేంద్రం అంగీకరించిన నేపథ్యంలో నిరసనలు విరమిస్తున్నట్లు సీజేపీ ప్రకటించింది. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసిన అనంతరం కేంద్రంతో సీజేపీ నేతలు మరోసారి చర్చలు జరిపారు. అనంతరం కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్‌తో కలిసి సీజేపీ ప్రతినిధులు మీడియాతో మాట్లాడారు. నిరసనకారులపై నమోదైన కేసులను కొట్టివేయాలని కేంద్రాన్ని కోరినట్లు తెలిపారు. కేవలం ఢిల్లీలోనే కాకుండా దేశవ్యాప్తంగా నమోదైన కేసులను కొట్టివేయాలని కోరినట్లు చెప్పారు. " నాలుగు రోజుల్లో కేసులు విత్‌డ్రా చేస్తామని కేంద్రం హామీ ఇచ్చింది. భవిష్యత్‌లోనూ స్పష్టత ఇచ్చింది.

## ప్రజల ఆకాంక్షల మేరకు నడవడమే ప్రజాస్వామ్యం



- కేంద్ర హోంశాఖ మంత్రి బండి సంజయ్ కుమార్
- తమకు పార్టీ కంటే.. దేశమే ప్రధానమన్నారు. '
- ప్రధాని నాయకత్వంలో ప్రజాస్వామ్యం అంటే.. ప్రజల గొంతు వినడం,
- వారి మాటను గౌరవించడం, అవసరమైతే బాధ్యత తీసుకునే ధైర్యాన్ని కలిగి ఉండటం.
- భాజపా దాన్నే పాటిస్తుంది. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా పార్టీ విలువలను ప్రతిబింబిస్తుంది.
- ఇన్నేళ్లపాటు దేశసేవలో భాగమైనందుకు ధర్మేంద్ర ప్రధాన్‌కు ధన్యవాదాలు"

## ఇది విద్యార్థుల విజయం..

- సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే హర్షం
- ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద విద్యార్థులు సంబరాలు
- 'శాంతియుతంగా చేసే ఏ ఆందోళనతో అయినా లక్ష్యం తప్పకుండా నెరవేరుతుంది.
- దీన్ని గాంధీజీ నుంచి నేర్చుకున్నా. ఈ దేశ యువత శాంతియుత నిరసనలు వృథాగా పోలేదు
- విద్యార్థుల పోరాటం ఫలించింది. వారి సత్తా ఏంటో తెలిసింది.
- ఈ విజయం విద్యార్థులందరిది. ప్రజాస్వామ్యం అంటే ఇదే"
- "మాకు రాజకీయాలు అవసరం లేదు. మా డిమాండ్లలో ఒకటి నెరవేరింది.
- మిగతా రెండూ నెరవేరే వరకు వేచి చూస్తాం.
- విద్యార్థులపై దాడి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలి.
- విద్యార్థులపై పెట్టిన అన్ని కేసులు పూర్తిగా ఎత్తివేయాలి.
- విద్యావ్యవస్థను ప్రక్షాళన చేసే వరకు ఈ ఉద్యమం ఆగదు.



## ప్రజా సమస్యల పరిష్కారంలో సంక్షేమ సంఘాలు కీలక పాత్ర పోషించాలి: ఎమ్మెల్యే కేపీ వివేకానంద్



**కుత్బుల్లాపూర్, జూలై 25 (తెలంగాణ వాణి):**
ప్రజలకు అందుబాటులో ఉంటూ సంక్షేమ సంఘాలు సమిష్టిగా పనిచేసి ప్రజా సమస్యల పరిష్కారంలో కీలక పాత్ర పోషించాలని బీఆర్ఎస్ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. 278వ వార్డు గాజులరామారం పరిధిలోని వీనస్ రాక్ హైట్స్ కాలనీ నూతన వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ సభ్యులు పేట్‌బషీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను శాలువా, పుష్పగుచ్ఛంతో సన్మానించి కాలనీలోని మౌలిక వసతులు, అభివృద్ధి పనులపై చర్చించారు. నూతన కమిటీకి అభినందనలు తెలిపిన ఎమ్మెల్యే, కాలనీ అభివృద్ధికి తమవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు వేమా రెడ్డి, ఉపాధ్యక్షులు అరవింద్, రాజేష్, ప్రధాన కార్యదర్శి దుర్గాప్రసాద్, కార్యవర్గ సభ్యులు, కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు

## ప్రభుత్వ ఆసుపత్రిపై కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**డ్యూటీలో నిర్లక్ష్యం సహించం.. ఉదయం 9 గంటలకే హాజరు తప్పనిసరి**



**సూర్యాపేట, జూలై 25 (తెలంగాణ వాణి జిల్లా బ్యూరో):**
సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యులు, సిబ్బంది ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విధుల్లో ఉండాలని, 100 శాతం బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి అని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం, ఆలస్యంగా హాజరైతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.
ఓపీ విభాగాల్లో సీనియర్ వైద్యులు తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని, వర్షాకాల నేపథ్యంలో డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి సీజనల్ వ్యాధులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మందుల కొరత లేకుండా బఫర్ స్టాక్ సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. ఆసుపత్రికి అవసరమైన ఆధునిక లాపరోస్కోపిక్ పరికరాల కొనుగోలుకు సీఎస్ఆర్ నిధులు, కలెక్టరేట్ గ్రాంట్ల ద్వారా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## కష్టకాలంలో కార్యకర్తకు అండగా బీఆర్ఎస్

**కేటీఆర్ జన్మదినాన రూ.20 వేల ఆర్థిక సాయం**



**అశ్వరావుపేట జూలై 25 (తెలంగాణ వాణి)**
అశ్వరావుపేట మండలంలోని మారుమూలగిరి గ్రామ పైనకొత్త కన్నాయిగూడెం కార్యకర్తసోడెం పూర్ణ చంద్రరావుకు నారం రాజ శేఖర్ ఆధ్వర్యంలో చేయూత పార్టీ కుటుంబ సభ్యులకు ఎల్ల ప్పుడూ అండగా ఉంటామని భరోసా కేటీఆర్ జన్మదినం సం దర్భంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయ కులుమరోసారి పార్టీ కార్యకర్తల పట్ల తమ బాధ్యతను చాటిచె ప్పారు. సోడెం పూర్ణ చంద్రరావు గత ఏడాది జరిగిన రోడ్డు ప్రమా దంలో తీవ్రంగా గాయపడి నడ వలేని స్థితిలో ఇంటికే పరిమిత మయ్యారుఈ నేపథ్యంలో రా ష్ట్ర బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రె సిడెంట్ మాజీ మంత్రి కల్వకుం ట్ల తారక రామారావు జన్మదినా న్ని పురస్కరించుకుని అశ్వారా వుపేట బీఆర్ఎస్పార్టీనాయ కు లు మండల సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షులు నారం రాజ శే ఖర్ ఆధ్వర్యంలో పార్టీ తరఫున సోడెంపూర్ణచంద్రరావుకురూ. 20,000 ఆర్థికసహాయాన్ని అంద జేయడంతో పాటుపండ్లను అం దించి పరామర్శించారు. ఈ సం దర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థి తిని అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పినారు నాయకులు కష్టకా లంలో పార్టీ కార్యకర్తలను ఎప్ప టికీ ఒంటరిగా వదిలిపెట్ట బోమ ని, బీఆర్ఎస్ కుటుంబం తమ ప్రతి కార్యకర్తకు అండగా నిలు స్తుందని భరోసా కల్పించారు. పార్టీ కోసం నిస్వార్థంగా పనిచే సిన ప్రతి కార్యకర్త సంక్షేమమే తమకుముఖ్యమని పేర్కొం టూఅవసరమైన ప్రతి సంద ర్భంలో చేయూత అందించేం దుకు సిద్ధంగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు బేతి మురళి, సున్నం సురేష్, యువ నాయకులు దుర్గారావు, శ్రీనునరసింహరావువీరాస్వా మి హేమంత్ అనిల్, వెంక న్న బాబు, గ్రామస్తులు, తదితరు లు పాల్గొన్నారు.

## వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న జూలూరుపాడు ప్రెస్ క్లబ్ సభ్యులు



**జూలూరుపాడు, జూలై 25 (తెలంగాణ వాణి):**
వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ జన్మదిన వేడుకల్లో జూలూరుపాడు మండల ప్రెస్ క్లబ్ సభ్యులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేతో కలిసి కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. అంతకుముందు ఎన్కూర్ మండలంలోని సీతారామ ప్రాజెక్టు కాలువను పరిశీలించిన ఎమ్మెల్యే, నీటి సరఫరా సక్రమంగా లేని ప్రాంతాలను గుర్తించి వెంటనే నీరు విడుదల చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడుతూ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిస్తూ, వైరా నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. జన్మదిన వేడుకల్లో పాల్గొని శుభాకాంక్షలు తెలిపిన జూలూరుపాడు మండల ప్రెస్ క్లబ్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు భూక్య వీరునాయక్, ఉపాధ్యక్షుడు కంచపోగు నరసింహారావు, కోశాధికారి ధారావత్ రాము, గౌరవ అధ్యక్షుడు బానోత్ రమేష్, వినోబానగర్ సర్పంచ్ గంగావత్ నవీన్, కాంగ్రెస్ జిల్లా నాయకుడు చౌడం నరసింహారావు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన

**సిరిపురం మేజర్‌కు సాగునీరు, అన్నారుగూడెం క్లస్టర్‌కు ఏఈఓ నియామకం కోరిన రైతులు**

**తల్లాడ, జూలై 25 (తెలంగాణ వాణి):**
తల్లాడ మండలం అన్నారుగూడెం గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ గొడ్ల ప్రభాకర్ అధ్యక్షతన శనివారం ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సందర్భంగా రైతులు మాట్లాడుతూ, సీతారామ ప్రాజెక్టు ద్వారా ఇతర ప్రాంతాలకు సాగునీరు అందుతున్నప్పటికీ సిరిపురం మేజర్ కాలువకు ఇప్పటికీ నీరు విడుదల కాకపోవడంతో వేలాది ఎకరాల్లో పంటలు ప్రమాదంలో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే సాగునీరు విడుదల చేసి పంటలను కాపాడాలని కోరారు. అలాగే అన్నారుగూడెం క్లస్టర్‌కు వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) లేకపోవడంతో



రైతులకు ప్రభుత్వ పథకాలు, సాంకేతిక సూచనలు అందడం లేదని పేర్కొంటూ, వెంటనే శాశ్వత ఏఈఓను నియమించాలని అధికారులకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కొమినేని వెంకటేశ్వర్లు, వ్యవసాయ శాఖ,



నీటిపారుదల శాఖ అధికారులు, ఎంపీడీవో, పంచాయతీ సభ్యులు, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## అమరుల ఆశయాలే నిజమైన నివాళి: సీపీఎం రాష్ట్ర నాయకుడు కనకయ్య

**అశ్వారావుపేట, జూలై 25 (తెలంగాణ వాణి):**
సామాజిక సంక్షేమం కోసం పోరాడిన అమరుల ఆశయాలను ఆచరణలో నెరవేర్చడమే వారికి ఇచ్చే నిజమైన నివాళి అని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యుడు అన్నవరపు కనకయ్య అన్నారు. అశ్వారావుపేట మండలం నందిపాడులో పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ కామ్రేడ్ ఊకే వీరాస్వామి తొలి వర్ధంతి సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశంలో ధరల పెరుగుదలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ పాలకులు పట్టించుకోవడం లేదని, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను విస్మరించి ప్రతిపక్షంలా వ్యవహరిస్తోందని విమర్శించారు. స్థానిక ప్రజా సమస్యల పరిష్కారానికి పార్టీ నాయకులు చిత్తశుద్ధితో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కొక్కెరపాటి పుల్లయ్య, జిల్లా కమిటీ సభ్యులు బుడితి



చిరంజీవి, మండల కార్యదర్శి సోడెం ప్రసాద్, కార్యదర్శివర్గ సభ్యులు ముల్లగిరి గంగరాజు, కారం సూరిబాబు, మడిపల్లి వెంకటేశ్వరరావు, ఊకే బుల్లెమ్మ, సర్పంచ్ కూరం దుర్గమ్మ, కారం వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన నిరుపేద కుటుంబాలకు బియ్యం, నిత్యవసర సరుకులు పంపిణీ..

**సీడీసీ, కింగ్ టు ద కింగ్డమ్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో చేయూత..**

**ఏన్కూర్, జులై 25 (తెలంగాణ వాణి) :**
మండల పరిధిలో కొత్త మేడిపల్లి గిరిజన, కోయ నిరుపేద కుటుంబాలకు సిడిసి (కమ్యూనిటీ డెవలప్మెంట్ సెంటర్), కింగ్ ఆఫ్ ద కింగ్డమ్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో శనివారం బియ్యం నిత్యవసర సరుకులను పంపిణీ చేశారు. వీటిని తల్లాడ టిసిసి అధ్యక్షులు ఖమ్మంపాటి ఇశ్రాయేలు చేతుల మీదుగా కొత్తమేడేపల్లిలోని గిరిజన





చిన్నారులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్య మంత్రిత్వ శాఖ మినిస్ట్రీస్ అధ్యక్షులు వంగల రత్న ప్రసాద్ ఆర్థిక సహాయ సహకారాలతో ఈ కుటుంబాలకు చేయూత అందించినట్లు తెలిపారు. సమాజంలో పేద కుటుంబాలను ఆదుకునే ఉద్దేశంతో ఈ సంస్థ స్థాపించడం జరిగిందని వారి ఆధ్వర్యంలో నిరుపేద కుటుంబాలకు నిత్యవసర సరుకులు అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు గొల్లమందల దేవా సహాయం, గుంటి బాబురావు, రావూరి కృష్ణయ్య, తిమోతి తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి: కలెక్టర్ దివాకర్ టీఎస్

**ఈర్లపూడిలో నిర్మాణ పనుల పరిశీలన.. ప్రతి సోమవారం బిల్లులు జమ అవుతాయని వెల్లడి**

**ఖమ్మం, జూలై 25 (తెలంగాణ వాణి):**
రఘునాథపాలెం మండలం ఈర్లపూడి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్ శనివారం పరిశీలించారు. లబ్ధిదారులు ప్రభుత్వ ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకుని ఇళ్ల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసుకోవాలని సూచించారు. ఈర్లపూడిలో తొలి విడతలో 160 ఇళ్లు మంజూరు కాగా, 98 ఇళ్లు పూర్తయ్యాయని, మిగిలిన 62 ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. నిర్మాణ పురోగతికి అనుగుణంగా ప్రతి సోమవారం బిల్లులను నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నామని, ఇల్లు పూర్తయిన తర్వాత మొత్తం రూ.5 లక్షల ఆర్థిక సాయం అందజేస్తామని చెప్పారు. నిర్మాణ సామగ్రి, సాంకేతిక సహాయం, బిల్లుల చెల్లింపుల్లో జాప్యం లేకుండా అధికారులు చర్యలు



తీసుకోవాలని ఆదేశించారు. రెవెన్యూ, గ్రామపంచాయతీ, హౌసింగ్ శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ భూక్యా శ్రీనివాస్, ఈఈ జగ్గారావు, తహసీల్దార్ శ్వేత, ఎంపీడీవో అశోక్, సర్పంచ్ గీతా దేవ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.





# ప్రజా పోరాటాలతోనే పార్టీ బలోపేతం: సీపీఎం

**భీమవరంలో రాజకీయ శిక్షణ తరగతులు**

**ఎర్రుపాలెం, జూలై 25 (తెలంగాణ వాణి):**
ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తేనే పార్టీ బలోపేతం అవుతుందని, దోపిడీ లేని సమాజ నిర్మాణమే సీపీఎం లక్ష్యమని పార్టీ మధిర డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు అన్నారు. ఎర్రుపాలెం మండలం భీమవరం గ్రామంలో నిర్వహించిన సీపీఎం రాజకీయ శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. గ్రామ శాఖలే పార్టీకి వెన్నెముక అని, రైతులు, కార్మికులు, నిరుద్యోగులు, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి గ్రామస్థాయిలో ఉద్యమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ విధానాలు రైతాంగానికి, కార్మికులకు నష్టదాయకంగా మారుతున్నాయని విమర్శించారు. అనంతరం మండల కార్యదర్శి మద్దాల ప్రభాకర్ జాతీయ, అంతర్జాతీయ రాజకీయ పరిణామాలపై కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు దివ్వెల వీరయ్య, నల్లమోతు హనుమంతరావు తదితర నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.





## ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలి

**సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మి**

**మూకమామిడిలో రైతులకు ప్రకృతి వ్యవసాయ శిక్షణ**



**అశ్వారావుపేట, జూలై 25 (తెలంగాణ వాణి):**
ములకలపల్లి మండలం మూకమామిడి గ్రామపంచాయతీలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్‌లో భాగంగా రైతులకు ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మి మాట్లాడుతూ, రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని, ఎల్‌నినో ప్రభావం దృష్ట్యా తక్కువ నీటితో సాగయ్యే పంటలను ఎంచుకోవాలని సూచించారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కేవీకే కోఆర్డినేటర్ భరత్ మాట్లాడుతూ కంది, పెసర, మినుము వంటి పంటలు సాగు చేయాలని, కంది రైతులకు ఉచిత విత్తనాలు అందజేస్తామని తెలిపారు. డివిజనల్ వ్యవసాయ సంచాలకులు రవికుమార్ ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో నాణ్యమైన దిగుబడులు సాధించాలని సూచించగా, మండల వ్యవసాయ అధికారి అరుణ్‌బాబు మట్టి నమూనాల సేకరణ, పరీక్షల ప్రాధాన్యత వివరించారు. అనంతరం అధికారులు పత్తి, మొక్కజొన్న, ఆయిల్‌పామ్ పంటలను పరిశీలించి చీడపీడల నివారణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దోమల అరుణ్‌కుమార్, ఏఈవో రాహుల్, వార్డు సభ్యులు, రైతులు, మహిళా రైతులు, యువకులు పాల్గొన్నారు.

## నారపోగు వెంకటేశ్వర్లను అభినందించిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క..



**తల్లాడ, జులై 25 (తెలంగాణ వాణి):**
టీపీసీసీ ఎస్సీ విభాగం రాష్ట్ర వైస్ చైర్మన్ గా నియామకమైన ఖమ్మం జిల్లా తల్లాడ మండలం గొల్లగూడెం గ్రామానికి చెందిన నారపోగు వెంకటేశ్వర్లును రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అభినందించారు. రాష్ట్ర వైస్ చైర్మన్ గా నియామకమైన సందర్భంగా శనివారం ఖమ్మంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు ఆయన పుష్పగుచ్ఛం అందించి శాలువాలతో సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లను ఉప ముఖ్యమంత్రి అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలని, ఎస్సీల అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. రానున్న రోజుల్లో ఉన్నత పదవులను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైరా శాసనసభ్యులు మాలోతు రామదాసు నాయక్, వైరా మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కాపా సుధాకర్, సీనియర్ నాయకులు కాపా అప్పయ్య, కాపా రామారావు, తదితరులు ఉన్నారు.

## సోమశిల ఆలయానికి త్వరలో కొత్త సొగసులు

కొల్లాపూర్ : తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం సాయంత్రం రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు కొల్లాపూర్ మండలం సోమశిల గ్రామంలోని శ్రీ లలితా సోమేశ్వర స్వామి ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు పూర్ణకుంభంతో మంత్రికి స్వాగతం పలికి, స్వామివారి సన్నిధిలో వేదమంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మంత్రి ఆలయ పరిస రాలను పరిశీలించి అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. సోమశిల ఆలయాన్ని అన్ని హంగులతో అభివృద్ధి చేసి భక్తులకు మరింత సౌకర్యవంతంగా తీర్చిదిద్దేందుకు సమగ్ర ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పురావస్తు శ సుమారు అరగంటపాటు సూచించారు.

## ఎస్సీలకు 15% రాజకీయ రిజర్వేషన్లు అమలు చేయాలి



**వనపర్తి, జూలై 25 (తెలంగాణ వాణి):**
రాష్ట్రంలో జరగనున్న అన్ని ఎన్నికల్లో ఎస్సీ అభ్యర్థులకు 15 శాతం రాజకీయ రిజర్వేషన్లు అమలు చేయాలని బీజేపీ ఎస్సీ మోర్చా డిమాండ్ చేసింది. శనివారం జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు గంధం ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఎస్సీలకు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యాసంస్థల్లో అమలవుతున్న విధానాన్ని అనుసరించి రాజకీయ రిజర్వేషన్లు కూడా 15 శాతానికి పెంచాలని, రాష్ట్ర ప్రభుత్వం దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర నాయకులు కొమ్ము సామేలు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు బాబురావు, బీజేపీ సీనియర్ నాయకులు సుబ్రహ్మణ్యం, ఐదో వార్డు కౌన్సిలర్ అభ్యర్థి బాల పీరు, నాలుగో వార్డు అభ్యర్థి గగనం శివతో పాటు ఎస్సీ మోర్చా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ముందస్తుగా కార్గిల్ విజయ్ దివస్ వేడుకలు




**వనపర్తి, జూలై 25 (తెలంగాణ వాణి):**
వనపర్తి జిల్లా ఆత్మకూరు పట్టణంలోని శ్రీ వాణి హైస్కూల్‌లో కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా ముందస్తుగా వేడుకలు నిర్వహించారు. హిందుస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో విద్యార్థులు పట్టణంలో ర్యాలీ, పరేడ్ నిర్వహించి కార్గిల్ అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ లత మాట్లాడుతూ, దేశ రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన కార్గిల్ వీరులను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని, వారి త్యాగాలు విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని అన్నారు. కార్యక్రమంలో గంగాధర్, అంజనీ, క్యాంప్ ఆఫీసర్లు ఆర్. హరికృష్ణ, స్కౌట్స్ మాస్టర్ రాఘవేంద్ర, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అంతరాష్ట్ర దొంగల ముఠా ప్రధాన నిందితుడు అరెస్ట్

### రూ.3 లక్షల చోరీ కేసు ఛేదించిన ఆదిలాబాద్ పోలీసులు



**ఆదిలాబాద్, జూలై 25 (తెలంగాణ వాణి)**
ఆదిలాబాద్ పట్టణంలోని ఐడీబీఐ బ్యాంక్ నుంచి నగదు డ్రా చేసిన వ్యక్తిని వెంబడించి స్కూటీ డిక్కీ పగులగొట్టి రూ.3 లక్షలు అపహరించిన కేసును పోలీసులు ఛేదించారు. ఈ కేసులో అంతరాష్ట్ర దొంగల ముఠా ప్రధాన నిందితుడు శంకర్ను అరెస్టు చేసి, అతని వద్ద నుంచి రూ. 1.80 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు.నిందితుడు తన సహచరులతో కలిసి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో బ్యాంకుల వద్ద నగదు డ్రా చేసిన వారిని లక్ష్యంగా చేసుకుని స్కూటీలు, కార్ల డిక్కీలు పగులగొట్టి చోరీలకు పాల్పడినట్లు విచారణలో వెల్లడైంది. పరారీలో ఉన్న మిగతా నిందితుల కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయని ఎస్పీ తెలిపారు. బ్యాంకుల నుంచి నగదు డ్రా చేసిన తర్వాత వాహనాల్లో నగదు ఉంచి నిర్లక్ష్యంగా వెళ్లవద్దని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి, వన్ టౌన్ సిఐ బి సునీల్ కుమార్, ఎస్సై నాగనాథ్, సంజయ్, సైబర్ క్రైమ్ ఎస్ఐ గోపికృష్ణ, సిబ్బంది రమేష్, త్రిశూల్, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

## భీంపూర్ మండలంలో విస్తృతంగా పర్యటించిన ఆడే గజేందర్



**బోథ్,భీంపూర్ 25(తెలంగాణా వాణి ప్రతినిధి):**
భీంపూర్ మండలంలో వివిధ గ్రామాల్లో ఏస్ఐఆర్ ప్రక్రియపై ఆరాతీశారు పలు అభివృద్ధి కార్యక్రమాల్లో మాజీ ఎంపీ సోయం బాపురావు తో కలిసి పాల్గొన్న బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటి, తాంసి కె, భీంపూర్, గుంజాల గ్రామాల్లో పర్యటించారు.ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో కొనసాగుతున్న ఏస్ఐఆర్ ప్రక్రియపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఏస్ఐఆర్ ప్రక్రియలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని,అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటరు జాబితాలో ఉండేలా బాధ్యతగా పనిచేయాలని సూచించారు అనంతరం గ్రామాల్లో చేపడుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించి, స్థానిక ప్రజలతో మాట్లాడారు. గ్రామస్తులు తమ సమస్యలను ఆడే గజేందర్ దృష్టికి తీసుకురాగా, వాటిని పరిష్కారానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు.ఆయన వెంట ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చేర్మెన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి,మాజీ డిసిసిబి చైర్మన్ అడ్డి భోజ రెడ్డి,ఆత్మ చైర్మన్ కౌడల నారాయణ,భీంపూర్ మండల అధ్యక్షులు సుదర్శన్,తాంసి మండల అధ్యక్షుడు కౌడల సంతోష్, భీంపూర్ సర్పంచ్ రవీందర్, అర్లి సర్పంచ్ అశోక్, పిప్పలకోటి సర్పంచ్ దాసరి రమేష్,ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు తన్వీర్ పటేల్ మరియు వివిధ గ్రామాల సర్పంచ్లు నాయకులు అను పటేల్, మతీన్ పటేల్,శ్రీనివాస్,క్రిష్ణ,యండి.సద్దాం,అనుపట్ల సంజీవ్,కరీం, ఖమర్ తదితరులు పాల్గొన్నారు.

# కాకా కుటుంబంపై విమర్శలు తగదు

### కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు వొడ్నాల శ్రీనివాస్



**రామకృష్ణాపూర్, జూలై 25 (తెలంగాణ వాణి):**
కాకా వెంకటస్వామి కుటుంబం, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామిపై బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న విమర్శలను కాంగ్రెస్ పార్టీ ఖండిస్తోందని రామకృష్ణాపూర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు వొడ్నాల శ్రీనివాస్ అన్నారు. కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.కాకా కుటుంబానికి ప్రజల్లో పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేకనే బీఆర్ఎస్ నాయకులు వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. ఐదు దశాబ్దాలుగా కాకా కుటుంబం పెద్దపల్లి ప్రాంత అభివృద్ధికి సేవలు అందించిందని పేర్కొన్నారు.ఎంపీ గడ్డం వంశీకృష్ణ యువతకు ఉద్యోగాల కల్పనపై చేసిన వ్యాఖ్యలను వక్రీకరించడం సరికాదన్నారు. బీఆర్ఎస్ పాలనలో జరిగిన పేపర్ లీకేజీలు, పరీక్షల రద్దు, వాయిదాలతో విద్యార్థులు, నిరుద్యోగులు తీవ్రంగా నష్టపోయారని విమర్శించారు.ఎంపీ వంశీకృష్ణ, మంత్రి వివేక్ వెంకటస్వామి అభివృద్ధి, ఉపాధి కల్పనకు కృషి చేస్తున్నారని తెలిపారు. వ్యక్తిగత విమర్శలు మానుకొని ప్రజా సమస్యలపై చర్చించాలని బీఆర్ఎస్ నాయకులకు సూచించారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మొక్కలు నాటండి- పర్యావరణాన్ని పరిరక్షించండి



**మందమర్రి జులై 25 (తెలంగాణ వాణి)**
పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒకరు ఒక మొక్క ను నాటి వాటిని పరిరక్షించాలని ప్రజా సేవా వెల్ఫేర్ సొసైటీ ఉపాధ్యక్షులు సుద్దాల ప్రభుదేవ పేర్కొన్నారు.ప్రజాసేవ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మందమర్రి మార్కెట్ ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో శనివారం మొక్కల నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా సుద్దాల ప్రభుదేవా మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ తమ వంతుగా కనీసం ఒక మొక్కను నాటి, వాటిని సంరక్షించాలని కోరారు. కరోనా మహమ్మారి సమయంలో ప్రజలు ఎదుర్కొన్న అనేక విపత్తులు పర్యావరణ పరిరక్షణ యొక్క ప్రాముఖ్యతను గుర్తు చేశాయని అన్నారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలంటే ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించడం తమ సామాజిక బాధ్యతగా భావించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజాసేవ వెల్ఫేర్ సొసైటీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు నందిపాట రాజ్‌కుమార్, జిల్లా కార్యదర్శి సంజీవ్, మండల అధ్యక్షుడు సాకినాల శంకర్, మద్దెల సంజీవ్ జావీద్ పాషా, పృథ్వి, దిలీప్, కుమారస్వామి, పప్పు వినోద్, అరం సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులపై సమీక్షా సమావేశం




**ఆదిలాబాద్, జులై : 25 ( తెలంగాణ వాణి ప్రతినిధి )**
ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని జలసిరి కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు.మంత్రి సీతక్క, సెర్ప్ సీఈఓ, పంచాయతీరాజ్ ఉ గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ దివ్య దేవరాజన్ తో కలిసి అన్ని జిల్లాల స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు, సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జలసిరి కార్యక్రమం, విబిజీ-ఆర్ఎంజీఎస్ పనులు, గ్రామపంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక అమలుపై సమీక్షించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, భవిష్యత్తులో నీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యల్లో భాగంగా నీటి సంరక్షణ నిర్మాణాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. "ప్రతి ఇంటికి ఇంకుడు గుంత -- ప్రతి పంటకు పంటకుంట -- ప్రతి ఊరికి ఊటకుంట" అనే లక్ష్యంతో భూగర్భ జలాల పరిరక్షణకు చర్యలు చేపట్టాలని అన్నారు.ప్రతి రైతు తన పొలంలో ఫామ్ పాండ్ నిర్మించుకునేలా అధికారులు చొరవ తీసుకోవాలని, ప్రతి ఇంటిలో ఇంకుడు గుంత ఏర్పాటు అయ్యేలా అవగాహన కల్పించాలని సూచించారు. రైన్‌వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణాల ద్వారా భూగర్భ జలాల మట్టాన్ని పెంచవచ్చని పేర్కొన్నారు.
విబిజీ-ఆర్ఎంజీఎస్ కార్యక్రమంలో తెలంగాణ దేశంలోనే ముందంజలో ఉందని పేర్కొన్న మంత్రి, అర్హులైన ప్రతి పేద కూలీకి ఉపాధి హామీ పనిదినాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, జడ్పి సి ఈ ఓ రవి, డీఆర్‌డీఓ ఆర్. రవీందర్, డిపిఓ రమేష్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## సిబ్బంది విధుల పట్ల అంకితభావంతో పనిచేయాలి

- **నేరాలు జరగకుండా పటిష్టమైన గస్తీ, బీట్ వ్యవస్థను నిర్వహించాలి.**
- **జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**



**ఆదిలాబాద్, జులై : 25 ( తెలంగాణ వాణి ప్రతినిధి )**
మండలంలో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా ప్రతిష్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. వార్షిక తనిఖీలలో భాగంగా జిల్లా ఎస్పీ ఆదిలాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ను పరిశీలించడం జరిగింది. మొదటగా సిబ్బందిచే ఏర్పాటు చేసిన గౌరవ వందనాన్ని స్వీకరించి పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశుభ్రతను పరిశీలించారు. పోలీస్ స్టేషన్లో ఉన్న వాహనాల ప్రస్తుత స్థితిగతులు తెలుసుకొని వాటిపై సిబ్బందికి సూచనలు చేశారు. పరేడ్ యొక్క ప్రాముఖ్యతను తెలియజేసి ప్రతి వారం పరేడ్ నిర్వహించాలని తెలిపారు. సిబ్బంది విధుల పట్ల అంకితభావంతో, ప్రజలకు సేవా భావంతో పనిచేయాలని తెలిపారు. సిబ్బంది ప్రతి ఒక్కరికి సమానమైన విధులు వచ్చేలా పర్యవేక్షించాలని సూచించారు. మండలంలో ఎలాంటి ఆర్థిక నేరాలు జరగకుండా పటిష్టమైన గస్తీ, పెట్రోలింగ్ నిర్వహించాలని, బీట్ సిస్టం సక్రమంగా జరిగేలా పర్యవేక్షించాలని తెలిపారు. మండలంలో ఎలాంటి గంజాయి, మాదకద్రవ్యాలు లేకుండా విపిఓ విధానం ద్వారా సిబ్బంది చే నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసుకొని సమాచారాన్ని సేకరించాలని సూచించారు. గంజాయి రహిత జిల్లా నిర్మాణానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని తెలిపారు. రికార్డులను పరిశీలించి ఎప్పటికప్పుడు నవీకరించాలని ఎలాంటి పెండెన్సీ లేకుండా చూడాలని తెలిపారు. పోలీస్ స్టేషన్కు వచ్చి బాధితుల పట్ల గౌరవంగా వ్యవహరిస్తూ, వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించి పోలీసుల పట్ల ఉన్న నమ్మకాన్ని పెంచేలా కృషి చేయాలని తెలిపారు. దర్యాప్తు నందు నాణ్యత ప్రమాణాలు పాటించాలని నిందితులకు శిక్షలు పడే విధంగా పరిశోధన జరగాలని తెలిపారు. విధి నిర్వహణలో ప్రతి ఒక్కరూ చక్కటి యూనిఫామ్ ధరించాలని తెలిపారు. ప్రజలకు సేవ అందించడంలో ప్రతిరోజు పోలీసు వ్యవస్థ ముందు పోలీసు పై ఉన్న నమ్మకాన్ని పెంచేలా ఉద్యోగ ధర్మాన్ని నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి, రూరల్ సీఐ రహీం పాషా, ఎస్సై వి విష్ణువర్ధన్, గంగా ప్రసాద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


## మొక్కలు నాటండి- పర్యావరణాన్ని పరిరక్షించండి





**మందమర్రి జులై 25 (తెలంగాణ వాణి)**
పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒకరు ఒక మొక్క ను నాటి వాటిని పరిరక్షించాలని ప్రజా సేవా వెల్ఫేర్ సొసైటీ ఉపాధ్యక్షులు సుద్దాల ప్రభుదేవ పేర్కొన్నారు.ప్రజాసేవ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మందమర్రి మార్కెట్ ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో శనివారం మొక్కల నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా సుద్దాల ప్రభుదేవా మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ తమ వంతుగా కనీసం ఒక మొక్కను నాటి, వాటిని సంరక్షించాలని కోరారు. కరోనా మహమ్మారి సమయంలో ప్రజలు ఎదుర్కొన్న అనేక విపత్తులు పర్యావరణ పరిరక్షణ యొక్క ప్రాముఖ్యతను గుర్తు చేశాయని అన్నారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలంటే ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించడం తమ సామాజిక బాధ్యతగా భావించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజాసేవ వెల్ఫేర్ సొసైటీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు నందిపాట రాజ్‌కుమార్, జిల్లా కార్యదర్శి సంజీవ్, మండల అధ్యక్షుడు సాకినాల శంకర్, మద్దెల సంజీవ్ జావీద్ పాషా, పృథ్వి, దిలీప్, కుమారస్వామి, పప్పు వినోద్, అరం సతీష్ తదితరులు పాల్గొన్నారు


## రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులకు తీవ్ర గాయాలు

**మందమర్రి జులై 25 (తెలంగాణ వాణి)**
మందమర్రి పోలీస్ స్టేషన్ ఫరిధిలోని మేడారం నయారా పెట్రోల్ బంక్ సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదం లో ముగ్గురు యువకులకు తీవ్ర గాయాలు అయ్యాయి ఒకే బైక్‌పై ముగ్గురు యువకులు ప్రయాణిస్తుండగా, అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్నట్లు ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు.ఈ ఘటనలో బైక్‌పై ఉన్న యువకులు రోడ్డుపై పడిపోవడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయనీ పరిస్థితి కొంత విషమంగా ఉన్నట్లు తెలిపారు.ఈ మెరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు.ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డిపై వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ నాయకులపై ఫిర్యాదు



**ఎల్లారెడ్డి, జూలై 25 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఎల్‌బీ నగర్ యువ సదస్సులో బీఆర్ఎస్ నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ కాంగ్రెస్ నాయకులు లింగంపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధ్యులపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, లేకపోతే ఆందోళనలు, రాస్తారోకోలు చేపడతామని హెచ్చరించారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ ఆదేశాల మేరకు ఎస్సై దీపక్ కుమార్‌కు ఫిర్యాదు అందజేశారు. కార్యక్రమంలో లింగంపేట మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బుర్ర రామకృష్ణ గౌడ్, టౌన్ అధ్యక్షుడు సుల్తాన్, సోషల్ మీడియా వర్కింగ్ ప్రెసిడెంట్ నవీన్, యువజన కాంగ్రెస్ నాయకులు తిరుపతి, ఫయాజ్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిసిన ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు



**ఎల్లారెడ్డి, జూలై 25 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఖర్గేకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన ఎమ్మెల్యే, ఆయన ఆయు రారోగ్యాలతో, సుఖసంతోషాలతో దీర్ఘాయుష్షుతో ఉండాలని ఆకాంక్షించారు.

## సాంబశివ జ్యోతిర్లింగాలయాన్ని దర్శించుకున్న జూనియర్ సివిల్ జడ్జి సాయికిరణ్ దంపతులు



**లక్షెట్టిపేట, జూలై 25 (తెలంగాణ వాణి):**
తొలి ఏకాదశి సందర్భంగా లక్షెట్టిపేట పట్టణంలోని సాంబశివ జ్యోతిర్లింగాలయంలో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా లక్షెట్టిపేట జూనియర్ సివిల్ జడ్జి కాసమల్ల సాయికిరణ్ దంపతులు స్వామివారిని దర్శించుకుని అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయంలో ఉదయం అభిషేకాల అనంతరం మహిళలతో విష్ణు సహస్రనామ పారాయణం నిర్వహించి, భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు చింతల శ్రీనివాస్, మాదంశెట్టి రామచందర్, సత్యనారాయణతో పాటు మహిళా భక్తులు పాల్గొన్నారు.

## శివ్వారం గోదావరి పైపులైన్ వినియోగంపై నిషేధం

-అనధికారికంగా వినియోగిస్తే క్రిమినల్ చర్యలు తప్పవు:అదనపు కలెక్టర్



**జైపూర్, జూలై 25 (తెలంగాణ వాణి):**
శివ్వారం గ్రామపంచాయతీ పరిధిలో గోదావరి నది నుంచి తాగునీటి సరఫరా కోసం ఏర్పాటు చేసిన పైపులైన్‌ను ఎవరూ అనధికారికంగా వినియోగించరాదని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య స్పష్టం చేశారు. పైపులైన్‌ను గ్రామ సర్పంచ్ అక్రమంగా వేలం వేశారనే ఫిర్యాదుల నేపథ్యంలో శనివారం ఆయన సంబంధిత అధికారులతో కలిసి గ్రామాన్ని సందర్శించి విచారణ చేపట్టారు.జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు, మిషన్ భగీరథ ఈఈ వెంకటేశ్వర్, డిప్యూటీ ఈఈ కిరణ్‌లతో కలిసి గోదావరి ఒడ్డున ఉన్న పైపులైన్‌ను పరిశీలించారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, అధికారులు, గ్రామ పెద్దలు, ప్రజలతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ప్రయోజనాల కోసం ఏర్పాటు చేసిన ప్రభుత్వ ఆస్తులు, మౌలిక సదుపాయాలను అనధికారికంగా వినియోగించడం చట్టరీత్యా నేరమని తెలిపారు. ఎవరైనా పైపులైన్‌ను నిబంధనలకు విరుద్ధంగా వినియోగిస్తే సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ఆర్డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. పైపులైన్‌ను ఇకపై ఎవరూ వినియోగించరాదని అధికారులు గ్రామ ప్రజలకు స్పష్టం చేయగా, గ్రామస్తులు ఏకగ్రీవంగా అంగీకరించి తీర్మానం చేశారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జి.సత్యనారాయణ, ఎంపీవో శ్రీపతి బాపురావు, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ ఎన్.రాజమల్లయ్య, పంచాయతీ కార్యదర్శి సృజన, సర్పంచ్ అంజన్ గౌడ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్ద చల్లా విశ్వంబర్ రెడ్డి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## పట్టుదలకు ప్రతీక ఏకలవ్య.. యువతకు స్ఫూర్తి

### భైంసాలో ఘనంగా ఏకలవ్య జయంతి వేడుకలు



**భైంసా, జూలై 25 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలో ఎరుకల సంఘం ఆధ్వర్యంలో ఆదివాసి వీరుడు ఏకలవ్య జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ తుమొల్ల దత్తాత్రి, కౌన్సిలర్లు చెర్ల సుభాష్, తాలోడ్ శ్రీనివాస్ తదితరులు హాజరై ఏకలవ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జనసేన జిల్లా నాయకుడు సుంకేట మహేష్ బాబు, మున్సిపల్ చైర్మన్ తుమొల్ల దత్తాత్రి మాట్లాడుతూ, స్వయంకృషి, క్రమశిక్షణ, అంకితభావానికి ఏకలవ్య జీవితం ప్రతీక అని, ఆయన ఆదర్శం యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యమని, ప్రతి యువకుడు విద్యను అభ్యసించి సమాజ అభ్యున్నతికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం సంఘ సభ్యులు, మహిళలు, యువకులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఏకలవ్య స్ఫూర్తిని చాటే నినాదాలు చేశారు. కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది.

## భైంసాలో ఘనంగా తొలి ఏకాదశి వేడుకలు

భారీ శోభాయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్



**నిర్మల్ - భైంసా: జూన్ 25 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలో విఠలేశ్వరుని శోభాయాత్ర భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. పురాణ్‌బజార్‌లోని మార్వాడీ భవన్ నుంచి ప్రారంభమైన విఠలేశ్వరుని పల్లకి యాత్ర పట్టణంలోని ప్రధాన వీధుల గుండా వైభవంగా సాగింది. ముధోల్ నియోజక వర్గ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ శోభాయాత్రను ప్రారంభించి, భజన దిండీలతో కలిసి యాత్ర ముగిసే వరకు పాల్గొన్నారు. విఠల్--రుక్మిణి,భక్త తుకారాం వేషధారణలో చిన్నారులు ఆకట్టుకోగా మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తి పారవశ్యాన్ని చాటారు. విఠల్--రుక్మిణి నామస్మరణతో భైంసా పట్టణం మారుమోగింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ మాట్లాడుతూ వార్కరి సంప్రదాయం ప్రపంచంలోనే గొప్ప ఆధ్యాత్మిక సంప్రదాయమని భక్తి మార్గం ద్వారా ఐక్యతా భావం పెంపొందడంతో పాటు సన్మార్గంలో నడిచే స్ఫూర్తి కలుగుతుందని పేర్కొన్నారు. శోభాయాత్రకు మార్గమధ్యంలోని ప్రతి ఇంటి వద్ద భక్తులు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుమొల్ల దత్తాత్రి, కౌన్సిలర్లు,వైద్యులు, ప్రజాప్రతినిధులు,ప్రముఖులు, మహిళలు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రోడ్డుపై చెత్త వేస్తే జరిమానా

**జమ్మికుంట, జూలై 25, (తెలంగాణ వాణి ప్రతినిధి) :**



మున్సిపల్ నిబంధనలను ఉల్లంఘిస్తూ రోడ్డుపై చెత్త వేస్తున్న వ్యాపార సంస్థలపై జమ్మికుంట మున్సిపాలిటీ కఠిన చర్యలు చేపట్టింది. మున్సిపల్ కమిషనర్ జి. మల్లికార్జున స్వామి ఆదేశాల మేరకు ప్రధాన రహదారిపై నిర్వహించిన పారిశుద్ధ్య తనిఖీల్లో ఒక స్వీట్ హౌస్, ఒక కిరాణా దుకాణం తమ వ్యాపార సంస్థల నుంచి వచ్చిన చెత్తను రోడ్డుపై వేస్తున్నట్లు అధికారులు గుర్తించారు.దీంతో మున్సిపల్ నిబంధనలు ఉల్లంఘించినందుకు ఆయా రెండు వ్యాపార సంస్థలకు రూ.1,000 చొప్పున అపరాధ రుసుము విధించారు. వ్యాపారులు తమ దుకాణాల నుంచి వచ్చే చెత్తను రోడ్డుపై వేయకుండా మున్సిపాలిటీ చెత్త సేకరణ వాహనానికే అందజేయాలని కమిషనర్ సూచించారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై ఇలాంటి చర్యలు నిరంతరం కొనసాగుతాయని ఆయన హెచ్చరించారు.ఈ తనిఖీల్లో మున్సిపల్ జవాన్లు కె. కిరణ్, దొడ్డ సంపత్ పాల్గొన్నారు.

# చట్టాలపై అవగాహనతోనే హక్కుల పరిరక్షణ సాధ్యం: జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె. ప్రభాకర రావు

బాలల రక్షణ, హక్కుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత: జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్, జులై : 25 ( తెలంగాణ వాణి ప్రతినిధి )**
ప్రజల్లో చట్టాలపై సమగ్ర అవగాహన పెంపొందినప్పుడే రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రతి ఒక్కరూ సమర్థవంతంగా వినియోగించుకోగలరని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా చట్టపరమైన సేవల సంస్థ (డీఎల్ఎస్ఏ) ఛైర్మన్ కె. ప్రభాకర రావు అన్నారు. న్యాయ అవగాహనను గ్రామస్థాయి వరకు విస్తరించి ఆదిలాబాద్ జిల్లాను వివాదరహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా చట్టపరమైన సేవల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన 'నాల్సా చైల్డ్ ఫ్రెండ్లీ లీగల్ సర్వీసెస్' అవగాహన సదస్సు, ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, బాలల రక్షణ అధికారుల ఓరియెంటేషన్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షాతో కలిసి జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ, భారత రాజ్యాంగం గర్భస్థ శిశువు నుంచి మరణించిన వ్యక్తి వరకు ప్రతి ఒక్కరి హక్కులను పరిరక్షించే గొప్ప రాజ్యాంగమని పేర్కొన్నారు. సమాజంలోని ప్రతి పౌరుడు తన హక్కులతో పాటు బాధ్యతలను కూడా తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.న్యాయపరమైన సమస్యలు ఎదురైనప్పుడు భయపడకుండా జిల్లా చట్టపరమైన సేవల సంస్థను సంప్రదించాలని సూచించారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలు, మహిళలు, ఎస్సీ, ఎస్టీ వర్గాలు, పిల్లలు తదితర అర్హులైన వారికి ఉచిత న్యాయ సహాయం అందుబాటులో ఉందని, ప్రజలు ఈ సేవలను విస్తృతంగా వినియోగించుకోవాలని కోరారు. పిల్లల హక్కుల పరిరక్షణపై పాఠశాలల్లో చేపట్టనున్న అవగాహన కార్యక్రమాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మూడు పాఠశాలలకు వచ్చే జనవరిలో జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, జిల్లా ప్రధాన న్యాయమూర్తి చేతుల మీదుగా ప్రత్యేక అవార్డులు



అందజేయనున్నట్లు ప్రకటించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల భద్రత, బాలికల సంక్షేమం, బాలల హక్కులు, చట్టాలపై సమగ్ర అవగాహన కల్పించేందుకు ఏడాది పొడవునా ప్రత్యేక కార్యాచరణ అమలు చేయనున్నట్లు తెలిపారు.జూన్ నుంచి వచ్చే ఏడాది మే వరకు ప్రతి నెల ఒక నిర్దిష్ట అంశాన్ని ఎంపిక చేసి విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు, చర్చలు, ఓరియెంటేషన్ తరగతులు, పోటీలు నిర్వహించాలని సూచించారు. బాలల హక్కులు, పోక్సో చట్టం, సైబర్ భద్రత, మంచి-చెడు స్పర్శ, వ్యక్తిత్వ వికాసం వంటి అంశాలపై విద్యార్థులను చైతన్యవంతులను చేయాలని పేర్కొన్నారు. పాఠశాలలు కేవలం విద్య బోధించే కేంద్రాలుగా కాకుండా విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి, విలువల పెంపొందింపుకు వేదికలుగా మారాలని అన్నారు. ప్రతి మూడవ శనివారం నిర్వహించే పేరెంట్-టీచర్ సమావేశాల్లో తల్లిదండ్రులకు కూడా బాలల రక్షణ, సైబర్ నేరాలు, సామాజిక బాధ్యతలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు.విద్యార్థుల్లో పెరుగుతున్న మొబైల్ ఫోన్ వినియోగం, సోషల్ మీడియా ప్రభావంపై ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థుల ప్రవర్తనలో అకస్మాత్తుగా వచ్చే మార్పులను గుర్తించి వెంటనే తల్లిదండ్రులతో చర్చించి తగిన కౌన్సెలింగ్ అందించాలని తెలిపారు. ప్రతి పాఠశాలలో విద్యార్థులు తమ సమస్యలను గోప్యంగా తెలియజేసేందుకు ఫిర్యాదు పెట్టెలు (కంప్లైంట్ బాక్సులు) ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమాలను ఒకరిద్దరు ఉపాధ్యాయుల బాధ్యతగా కాకుండా మొత్తం ఉపాధ్యాయ బృందం సమిష్టిగా అమలు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసి ఉత్తమ ప్రతిభ కనబరిచిన పాఠశాలలు, సంబంధిత అధికారులకు 2027 మే నెలలో జిల్లా స్థాయి, అనంతరం హైకోర్టు స్థాయిలో ప్రత్యేక గుర్తింపు, ప్రశంసలు లభించే అవకాశం ఉందని తెలిపారు.అదనపు ఎస్పీ మౌనిక మాట్లాడుతూ, బాలల భద్రత, పోక్సో చట్టంపై అవగాహన కల్పించడంలో "పోలీస్ అక్క" కార్యక్రమం విశేష ఫలితాలు సాధిస్తోందన్నారు. గత జూన్ నుంచి ఇప్పటివరకు 43 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయడంతో పాటు 100కు పైగా ఫిర్యాదులు స్వీకరించి, 23 బాల్య వివాహాలను అడ్డుకున్నట్లు వెల్లడించారు. విద్యార్థుల ప్రవర్తనలో కనిపించే మార్పులను ఉపాధ్యాయులు ముందుగానే గుర్తించి స్పందిస్తే అనేక మంది పిల్లల భవిష్యత్తును రక్షించవచ్చని ఆమె పేర్కొన్నారు.జిల్లా చట్టపరమైన సేవల సంస్థ కార్యదర్శి రాజ్యలక్ష్మి మాట్లాడుతూ, పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. ఉపాధ్యాయులను బాలల రక్షణ అధికారులుగా భాగస్వామ్యం చేస్తూ ప్రత్యేక చైతన్య కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, సైబర్ భద్రత, బాలల హక్కులపై విద్యార్థుల్లో చైతన్యం పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి డి. మాదవి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నగేష్, బాల ల సంరక్షణ అధికారి రాజేంద్ర ప్రసాద్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, న్యాయవాదులు, బాలల రక్షణ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జలసిరి కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలి

రాష్ట్ర పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క

**నిర్మల్, జూలై 25 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
జలసిరి కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. మంత్రి సీతక్క, సెర్ప్ సీఈఓ, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ దివ్య దేవరాజన్, ఇతర అధికారులతో కలిసి అన్ని జిల్లాల స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు, ఇతర అధికారులతో శనివారం సాయంత్రం జలసిరి కార్యక్రమం, విబిజి రామ్ జి పనులు, గ్రామపంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక, తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని అన్నారు. భవిష్యత్తులో నీటి సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు జలసిరి కార్యక్రమంలో భాగంగా నీటి సంరక్షణ నిర్మాణాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి ఇంటికి ఇంకుడు గుంత, ప్రతి పంటకు పంట కుంట, ప్రతి ఊరికి ఊట కుంట, కానీ





నినాదంతో భూగర్భ జలాల సంరక్షణకు చర్యలు ప్రారంభించామని అన్నారు. ప్రతి రైతు తమ పొలాలలో ఫామ్ పాండ్ నిర్మించుకునేలా అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. ప్రతి ఇంటికి ఇంకుడు గుంత ఉండాలన్నారు. రైన్ వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణాల ద్వారా భూగర్భ జలాల సంరక్షణ సాధ్యమవుతుందని తెలిపారు. విబిజి రామ్ జి కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పనులలో దేశంలోనే ముందువరుసలో ఉన్నామని అన్నారు. అర్హులైన ప్రతి పేద కూలీలందరికీ పని దినాలు కల్పించాలని ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి ఈ వీసీ లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, డిఆర్డిఓ విజయలక్ష్మి, ఈఈ ఆర్డబ్ల్యుఎస్ సందీప్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## సారంగాపూర్‌లో బీఎల్ఎస్, బీఎల్ఏల సమన్వయ సమావేశం నిర్వహించిన కూచాడి శ్రీహరి రావు

**నిర్మల్, జూలై 25 (తెలంగాణ వాణి ప్రతినిధి)**



నిర్మల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కూచాడి శ్రీహరి రావు గారు నేడు సారంగపూర్ మండలంలో నిర్వహించిన బూత్ లెవల్ సూపర్‌వైజర్లు (బి ఎల్ ఎస్), బూత్ లెవల్ ఏజెంట్లు (బి ఎల్ ఏ) సమన్వయ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి బూత్ లెవల్ సూపర్‌వైజర్, బూత్ లెవల్ ఏజెంట్ తమ పరిధిలోని ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలిస్తూ, ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన విధివిధానాలను పాటిస్తూ, మండలంలోని అన్ని పోలింగ్ బూత్‌లలో సమన్వయంతో పనిచేసి, ఆగస్టు 3వ తేదీలోపు 100 శాతం అర్హులైన ఓటర్ల నమోదు, సవరణలు, ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి అయ్యేలా అప్రమత్తంగా వ్యవహరించాలని కోరారు.ఈ సమావేశంలో సారంగపూర్ మండలంలోని సర్పంచులు,



ఎంపీటీసీలు, మాజీ ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్ హాది, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ భీంరెడ్డి రెడ్డి, రాజమోహ్మోద్ , వివిధ గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు,జిల్లా డీసీసీ ప్రధాన కార్యదర్శి గాజుల రవికుమార్, జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి కొట్టె శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# జ్యోతిష్మతిలో విద్యార్థులకు “ఆర్థిక చేయూత”

**తిమ్మాపూర్, జూలై 25, ( తెలంగాణ వాణి ప్రతినిధి)**
పేదరికం చదువుకు అడ్డుకాకూడదనే లక్ష్యంతో జ్యోతిష్మతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (అటానమస్) యాజమాన్యం గొప్ప నిర్ణయం తీసుకుంది. బీటెక్‌లో చేరిన ప్రతిభావంతులైన విద్యార్థులకు ఏటా రూ. 18 వేల చొప్పున, కోర్సు పూర్తయ్యే వరకు మొత్తం రూ. 72 వేల ఆర్థిక సాయాన్ని అందించేలా చర్యలు చేపట్టింది.ఈ కార్యక్రమంలో భాగంగా, షాలిని ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ద్వారా సీఎస్ఈ మొదటి సంవత్సరంలో చేరిన విద్యార్థులు కట్ట హరీశ్వర్, అబ్దుల్ రెహన్, అదిబా మహిన్, గోషికొండ భువన శ్రీ, ఊగిలా అక్షిత, బొద్దు లక్ష్మీప్రసన్న,కొప్పుల ప్రశాంత్ కుమార్, మహమ్మద్ తాలిబొద్దీన్, గుండవేని అశ్విత్ సాయి, బనద్రి అజయ్ తేజ, వీరబత్తిని శ్రీమని,పెద్ది అవినాష్, గంగాధర ఉదయ్, కోట అఖిల్, గుండేటి రక్షిత్ చంద్రన్,గాదె హన్సిక, శ్రీనిధి లకు చెక్కులను విద్యాసంస్థల చైర్మన్ జువ్వాడి సాగర్ రావు శనివారం అందజేశారు.ఈ సందర్భంగా చైర్మన్ సాగర్ రావు మాట్లాడుతూ..ఆర్థిక ఇబ్బందుల వల్ల ఏ విద్యార్థి ఉన్నత విద్యకు దూరం కాకూడదు.అందుకే మా ట్రస్ట్ ద్వారా ప్రతి విద్యార్థికి



ఏటా రూ. 18 వేల స్కాలర్‌షిప్ అందజేస్తున్నాం. ప్రతిభ కలిగిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, ఉన్నత లక్ష్యాలను సాధించి సమాజానికి సేవ చేయాలి అని పిలుపునిచ్చారు.?కళాశాల యాజమాన్యం కల్పిస్తున్న ఈ ఆర్థిక భరోసా విద్యార్థుల తల్లిదండ్రులలో సంతోషాన్ని నింపింది. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థుల విజయమే .. తాటిపర్తి జీవన్ రెడ్డి

**జగిత్యాల: జులై 25(తెలంగాణ వాణి ప్రతినిధి)**



నీట్ ప్రశ్నపత్రాల లీకేజీ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం విద్యార్థుల ప్రజాస్వామ్య ఉద్యమ విజయమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి పేర్కొన్నారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద రాజకీయాలకు అతీతంగా 28 రోజుల పాటు విద్యార్థులు చేపట్టిన శాంతియుత ఉద్యమానికి కేంద్ర ప్రభుత్వం స్పం దించి, విద్యార్థి నాయకులతో చర్చలు జరపడంతో పాటు మంత్రి రాజీనామా చేయడం ఉద్యమ ఫలితమని అన్నారు. విద్యార్థుల సమస్యలకు మద్దతుగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో ఇందిరా పార్క్ వద్ద నిర్వహించిన ధర్నా ద్వారా లీకేజీ బాధ్యులపై చర్యలు తీసుకునే వరకు పార్టీ అండగా నిలవడం అభినందనీయమని తెలిపారు. విద్యార్థుల హక్కుల పరిరక్షణలో బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు. నీట్ ప్రశ్నపత్రం లీకేజీ కారణంగా ఆత్మహత్యలకు పాల్పడిన ప్రతి విద్యార్థి కుటుంబానికి రూ.1 కోటి పరిహారం అందించాలని, అలాగే శాంతి యుతంగా ఉద్యమించిన విద్యార్థులపై నమోదైన కేసులను కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించు కోవాలని తాటిపర్తి జీవన్ రెడ్డి డిమాండ్ చేశారు.



## దివ్యాంగుల ఆత్మగౌరవానికి ప్రతీకగా పునరావాస కేంద్రం భవనం

**తిమ్మాపూర్, జూలై 25, ( తెలంగాణ వాణి ప్రతినిధి )**
వికలాంగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్ గ్రామంలో రూ.10 లక్షల వ్యయంతో చేపట్టనున్న వికలాంగుల పునరావాస కేంద్ర భవన నిర్మాణ పనులకు ఆయన భూమిపూజ చేశారు.నియోజకవర్గంలో వికలాంగుల కేంద్రానికి సొంతభవనం నిర్మించడం ఇదే ప్రథమమని తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సమాజంలో వికలాంగులు ఆత్మగౌరవంతో, గౌరవప్రదమైన జీవనం సాగించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. వికలాంగుల సంఘాల కార్యకలాపాలు, సమావేశాలు, శిక్షణ కార్యక్రమాల నిర్వహణకు ఈ భవనం ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.సమాజంలో ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, నియోజకవర్గంలో మౌలిక వసతుల కల్పనకు నిరంతరం కృషి చేస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో నుస్తులాపూర్ గ్రామ సర్పంచ్ తుమ్మనపల్లి సంధ్య శ్రీనివాసరావు, డిఆర్డిఏ ప్రాజెక్టు డైరెక్టర్ మచ్చ గీత, అడిషనల్ డిఆర్ఓ రవికుమార్,తిమ్మాపూర్ ఎంపీడీవో మల్హోత్ర, ఎంపీ ఓ సంపత్, వికలాంగుల సంక్షేమ శాఖ సిసి పద్మ ఫిజియోథెరపిస్ట్ రాజేందర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి రమేష్, నుస్తులాపూర్ సింగల్ విండో చైర్మన్ మోరపల్లి రమణారెడ్డి, పోరండ్ల చైర్మన్ గోపు మల్లారెడ్డి,ఆత్మ కమిటీ చైర్మన్ చెన్నబోయిన రవి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తాళ్లపల్లి సంపత్ గౌడ్, పార్టీ నాయకులు ఎస్ఎల్ గౌడ్, దావు సంపత్ రెడ్డి, శ్రీగిరి రంగారావు, బుధారపు శ్రీనివాస్, కొత్త తిరుపతిరెడ్డి, కొండలరావు, కంది లక్ష్మీనారాయణ రెడ్డి, కంది అశోక్ రెడ్డి, చింతల లక్ష్మారెడ్డి, పోలు రాము, రమేష్, మాచర్ల అంజయ్య, శ్రీధర్, కర్లపల్లి మహేందర్ డ్డి, కాసర్ల సంపత్, డాక్టర్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## వేములవాడ షాపు కూల్చివేత ఘటనపై జాతీయ ఎస్సీ కమిషన్ సీరియస్

**కలెక్టర్, ఎస్పీ, దేవాదాయ కమిషనర్‌కు నోటీసులు.. 15 రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశం**




**వేములవాడ, జూలై 25 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
వేములవాడలో దళిత బీజేపీ కౌన్సిలర్ కొండ్లెపు ముత్యం షాపు కూల్చివేత ఘటనపై జాతీయ ఎస్సీ కమిషన్ స్పందించింది. ఘటనను తీవ్రంగా పరిగణించిన కమిషన్ జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, దేవాదాయ శాఖ కమిషనర్‌కు నోటీసులు జారీ చేసి 15 రోజుల్లో పూర్తి నివేదిక సమర్పించాలని ఆదేశించింది. దళితుడిననే కారణంతో తన షాపును కక్షపూరితంగా కూల్చివేశారని కొండ్లెపు ముత్యం ఆరోపిస్తూ జాతీయ ఎస్సీ కమిషన్‌ను ఆశ్రయించారు. ఫిర్యాదును పరిశీలించిన కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామచందర్ కేసు వివరాలు, విచారణ పురోగతి, తీసుకున్న చర్యలు, నష్టపరిహారం అంశాలపై నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. అధికారులు ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా షాపును తొలగించి సుమారు రూ.1 లక్ష నష్టం కలిగించారని బాధితుడు ఆరోపించారు. ఈ ఘటనపై ఇప్పటికే స్థానిక అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బీజేపీ కౌన్సిలర్లు, నాయకులు బాధితుడికి మద్దతు తెలుపుతూ న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని తెలిపారు.

## మల్లాపూర్‌లో 'భూభారతి' రీసర్వే పూర్తి



**తిమ్మాపూర్, జూలై 25,( తెలంగాణ వాణి ప్రతినిధి )**
రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సమగ్ర భూ రీసర్వే కార్యక్రమంలో భాగంగా తిమ్మాపూర్ మండలం మల్లాపూర్ గ్రామ భూములకు సంబంధించిన పూర్తి వివరాలతో కూడిన 'భూభారతి రీసర్వే' బ్రీఫ్ నోట్‌ను అధికారులు విడుదల చేశారు. ఈ రీసర్వేతో మల్లాపూర్ గ్రామ భూముల లెక్కలన్నీ పక్కాగా తేలగా, భూసమస్యల పరిష్కారానికి, భూమికి శాశ్వత హక్కు కల్పించేందుకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని స్థానికులు భావిస్తున్నారు. అధికారిక నివేదిక ప్రకారం.. మల్లాపూర్ గ్రామంలో మొత్తం 538 సర్వే నంబర్లు ఉండగా, గ్రామంలోని మొత్తం భూ విస్తీర్ణం 2379 ఎకరాల 17 గుంటలుగా తేలింది. ఇందులో గ్రామకంఠం కింద 16 ఎకరాల 21 గుంటల భూమి ఉంది. గ్రామంలో మొత్తం 503 పట్టా సర్వే నంబర్లు ఉండగా, వీటి పరిధిలో 1890 ఎకరాల 39 గుంటల పట్టా భూమి అందుబాటులో ఉంది. అలాగే మొత్తం 35 ప్రభుత్వ సర్వే నంబర్ల పరిధిలో 459 ఎకరాల 38 గుంటల ప్రభుత్వ భూమి ఉన్నట్లు అధికారిక నివేదిక స్పష్టం చేస్తోంది. డిజిటల్ టెక్నాలజీతో చేపట్టిన ఈ రీసర్వేతో భూ వివాదాలకు తెరపడి, రైతులకు శాశ్వత యాజమాన్య భద్రత చేకూరుతుందని సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రెడ్డి, తిమ్మాపూర్ తహసిల్దార్ కర్ర శ్రీనివాస్ రెడ్డి, గ్రామ సర్పంచ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

## తెలంగాణ ఉద్యమకారుడు, సీనియర్ జర్నలిస్టు కొడారి వెంకటేష్ పుట్టినరోజు వేడుకలు



**భువనగిరి జూలై:25(తెలంగాణ వాణి విలేఖరి)**
యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రానికి చెందిన సామాజిక కార్యకర్త, సీనియర్ జర్నలిస్టు తెలంగాణ ఉద్యమకారులు కొడారి వెంకటేష్ పుట్టినరోజు వేడుకలు శనివారం భువనగిరి జిల్లా కేంద్రంలోని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రజాసంఘాల నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మొదట డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహంకు నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా భారత రాజ్యాంగం వర్ధిల్లాలి , భారత రాజ్యాంగం ను కాపాడుకుందాం, అంబేద్కర్ ఫోటోను కరెన్సీ నోట్ల పై ముద్రించాలని నినాదాలు చేశారు. అనంతరం కొడారి వెంకటేష్ ను శాలువాతో సన్మానించి, మిఠాయి తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మరియు మైనారిటీ సంఘాలకు చెందిన నాయకులు బట్టు రామచంద్రయ్య, బర్రె సుదర్శన్, బుచ్చాల స్వామి, పుట్ట వీరేష్ యాదవ్, గుండె బోయిన సురేష్ యాదవ్, ఎండీ ఇంతియాజ్ అహ్మద్, ఎండీ సానూర్ బాబా, ఎండీ జాకీర్, పల్లెర్ల వెంకటేష్, సిలివేరు రమేష్, నల్ల కృష్ణ, సున్నం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## నల్లగొండ జిల్లా టూ టౌన్ సిఐగా ఆదిరెడ్డి బాధ్యత స్వీకరణ

**మర్యాదపూర్వకంగా కలిసిన ఎస్సీ ఎస్టీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కట్టెల శివకుమార్**

**నల్గొండ జులై 25( తెలంగాణ వాణి ప్రతినిధి )**
నల్లగొండ జిల్లా కేంద్రంలో నూతనంగా నల్గొండ జిల్లా టూ టౌన్ సి ఐ గా బాధ్యతలు చేపట్టిన ఆది రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన పెన్షనర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు కొంపెల్లి బిక్షపతి ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షులు మామిడి సైదులు కందుల విజయ్ కుమార్ ఎస్సీ ఎస్టీ విద్యార్థి సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు కట్టెల శివకుమార్ రాష్ట్ర కార్యదర్శి బండారు శంకర్ సహాయ కార్యదర్శి మాతంగి శ్రీకాంత్ రాష్ట్ర కోఆర్డినేటర్ బాకీ తరుణ్ తదితరులు పాల్గొన్నారు.




# జన్మదినం... జనహితానికి అంకితం....!

- రోగులకు చేయూత...ప్రకృతికి తోడుగా...
- సేవా సందేశం చాటిన టీయూడబ్ల్యూజే

**రాష్ట్ర ఉపాధ్యక్షులు లాయక్ పాషా**

**వేములవాడ,జూలై 25 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి)**
: నేటి సమాజంలో జన్మదినం అంటే కేక్ కటింగ్‌లు, పూల బొకేలు, శుభాకాంక్షల సందడి అనే భావన బలపడుతున్న వేళ... ఆ వేడుకకు సామాజిక బాధ్యతను జోడించి ఆదర్శంగా నిలిచారు తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే) రాష్ట్ర ఉపాధ్యక్షులు, రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు సయ్యద్ లాయక్ పాషా. తన జన్మదినాన్ని వ్యక్తిగత సంబరంగా కాకుండా సేవా దినోత్సవంగా మార్చి, సమాజానికి అవసరమైన రెండు ముఖ్యమైన సందేశాలను ఆచరణలో చూపించారు ఒకటి మానవసేవ...మరొకటి పర్యావరణ పరిరక్షణ.

**రోగుల ముఖాల్లో చిరునవ్వులు.....**
వేములవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేసి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. బాధలో ఉన్న వారికి ఓదార్పు, ఆప్యాయత కూడా





ఒక మందులాంటిదేనని నిరూపిస్తూ ప్రతి రోగిని పరామర్శించారు. లాయక్ పాషా చేపట్టిన ఈ సేవా కార్యక్రమం ఆసుపత్రి వాతావరణంలో ఆత్మీయతను నింపింది.

**మొక్క నాటితేనే భవిష్యత్తుకు భరోసా....**
అనంతరం జర్నలిస్టు కాలనీలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు శ్రీకారం చుట్టారు. "వృక్షో రక్షతి రక్షితః" అనే భారతీయ సూక్తిని గుర్తు చేస్తూ, చెట్లను కాపాడితే అవే మానవాళిని కాపాడతాయని పేర్కొన్నారు. పెరుగుతున్న కాలుష్యం, వాతావరణ మార్పులు, అడవుల క్షీణత వంటి సమస్యలను అధిగమించాలంటే ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. ప్రతి జన్మదినాన్ని ఒక మొక్కతో ప్రారంభించే సంస్కృతి రావాలని ఆకాంక్షించారు.

**వేడుకల కంటే విలువైన సేవ....**
సహచర జర్నలిస్టులు, స్నేహితుల సమక్షంలో అగ్రహారంలోని 'శ్రీ' కన్వెన్షన్ ఫంక్షన్ లో కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు నిర్వహించినప్పటికీ, ఆ వేడుకలకు అసలైన అందాన్ని తీసుకొచ్చింది సేవా కార్యక్రమాలే వ్యక్తిగత ఆనందాన్ని సమాజంతో పంచుకోవడమే నిజమైన వేడుక అనే సందేశాన్ని లాయక్ పాషా తన ఆచరణతో చాటిచెప్పారు.

**జర్నలిస్టు బాధ్యతకు నిలువెత్తు నిదర్శనం....**
వార్తలను ప్రజల ముందుకు తీసుకురావడం మాత్రమే కాదు... సమాజంలో మార్పుకు మార్గనిర్దేశం చేయడం కూడా జర్నలిస్టు బాధ్యతేనని లాయక్ పాషా మరోసారి నిరూపించారు. ప్రజా



సమస్యలపై కలం పట్టే జర్నలిస్టు, సమాజ హితానికి చేతులు కూడా కలపాలనే సందేశాన్ని ఆయన కార్యక్రమాలు స్పష్టంగా తెలియజేశాయి.

**సేవతో స్ఫూర్తి... సమాజానికి సందేశం...**
జన్మదినాన్ని సేవా కార్యక్రమాలతో నిర్వహించడం ద్వారా యువతకు, సామాజిక సంస్థలకు లాయక్ పాషా స్ఫూర్తిదాయకంగా నిలిచారు. ప్రతి ఒక్కరూ తమ జీవితంలోని ప్రత్యేక రోజులను సమాజానికి ఉపయోగపడే విధంగా మార్చుకుంటే సామాజిక మార్పు మరింత వేగంగా సాధ్యమవుతుందని ఆయన కార్యక్రమాలు చాటిచెప్పాయి. ఈ కార్యక్రమంలో వేములవాడ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కొలిపాక నరసయ్య, ప్రధాన కార్యదర్శి సయ్యద్ అలీ, సీనియర్ పాత్రికేయులు తాహేర్ పాషా, రేగుల రాంప్రసాద్, కార్యవర్గ సభ్యులు, పెద్ద సంఖ్యలో పలువురు జర్నలిస్టులు పాల్గొని లాయక్ పాషాకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఘనంగా తొలి ఏకాదశి వేడుకలు

**భక్తి శ్రద్ధలతో పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు --**

**చిగురుమామిడి, జూలై 25: ( తెలంగాణ వాణి విలేఖరి )**
కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలంలో, తొలి ఏకాదశి పర్వదినాన్ని భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో, ఆధ్యాత్మిక ఉత్సాహంతో నిర్వహించారు. మండలంలోని రేకొండ , రామంచ, చిన్నముల్కనూర్ , బొమ్మనపల్లి,ఆలయాలన్నీ తెల్లవారుజామునే భక్తులతో కిటకిటలాడగా, గోవింద నామస్మరణలు, విష్ణు సహస్రనామ పారాయణాలు, భజనలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ముఖ్యంగా సుందరగిరి గ్రామంలోని కోర మీసాల శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఉదయం 5 గంటల నుంచే ప్రత్యేక పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అర్చకులువేద మంత్రోచ్చారణల మధ్య అభిషేకాలు, అర్చనలు నిర్వహించగా, భక్తులు "గోవింద... గోవింద..." నామస్మరణతో స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణమంతా భక్తి భావంతో నిండిపోయింది. మండలంలోని ఇతర విష్ణు ఆలయాలు, గ్రామ దేవాలయాల్లో కూడా తొలి ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు, భజనలు, విష్ణు సహస్రనామ పారాయణాలు నిర్వహించారు. ఏడాదిలో అత్యంత విశిష్టమైన



ఏకాదశిగా భావించే ఈ పర్వదినం సందర్భంగా పలువురు భక్తులు నిర్జల, ఫలాహార ఉపవాస దీక్షలను ఆచరించారు. మరికొందరు సంప్రదాయ పద్ధతిలో పిండి వంటలు తయారు చేసి కుటుంబ సభ్యులతో కలిసి భుజిస్తూ పండుగను ఆనందంగా జరుపుకున్నారు. తొలి ఏకాదశి సందర్భంగా గ్రామాల్లో భక్తి, సంప్రదాయం, ఆధ్యాత్మికత కలగలిసి కనిపించగా, ఆలయాల్లో శాంతి, సౌభాగ్యం, సకల జనుల ఆయురారోగ్యాల కోసం, సమృద్ధిగా వర్షాలు పడాలని, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మొత్తం మీద చిగురుమామిడి మండలంలో తొలి ఏకాదశి పర్వదినం భక్తి ప్రపత్తులతో ఘనంగా జరిగింది.

## తక్కువ నీటితో సాగు చేసే ఆరుతడి పంటలనే వేసుకోవాలి

**మాలపల్లిలో ఎల్‌నినోపై ప్రత్యేక గ్రామసభలో సర్పంచ్ వెన్న స్వర్ణ లత రాజు**

**హుస్నాబాద్,రూరల్ జూలై 25 ( తెలంగాణ వాణి )**
హుస్నాబాద్ మండలం మాలపల్లి గ్రామంలో ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో ప్రత్యేక గ్రామసభను సర్పంచ్ వెన్న స్వర్ణలత రాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు పాల్గొని వర్షాభావ పరిస్థితుల్లో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. తక్కువ నీటితో సాగు చేసే ఆరుతడి పంటలను సాగు చేయాలని సూచించారు. గ్రామంలో తాగునీటి పరిస్థితిపై సమీక్ష నిర్వహించి, భూగర్భ జలాల పెంపు కోసం ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు, ఈ సందర్భంగా సర్పంచ్ వెన్న స్వర్ణలత రాజు మాట్లాడుతూ గ్రామంలో నెలకొన్న నీటి కొరతను దృష్టిలో ఉంచుకుని కొత్త ఓపెన్ వెల్ తవ్వకానికి సంబంధిత అధికారులు అనుమతులు మంజూరు చేసి



నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు, ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బత్తుల శ్రీనివాస్, వార్డు సభ్యులు, వ్యవసాయ అధికారులు వెటర్నరీ వైద్యాధికారి, పంచాయతీ కార్యదర్శి, ఏవో, వీఆర్ఏ, జీఐ, ఏపీఓ, ఎంపీఓలు బీఎల్‌వో, ఫీల్డ్ అసిస్టెంట్, ఆశ కార్యకర్త, కారోబార్, రైతులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## తోటి మిత్రుని కుటుంబానికి రూ.10,016 ఆర్థిక సహాయం

**జమ్మికుంట, జులై 25, (తెలంగాణ వాణి ప్రతినిధి) :**
ఇటీవల ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యకు పాల్పడి మృతి చెందిన జమ్మికుంటకు చెందిన కేబుల్ ఆపరేటర్ రామ్మూర్తి కుటుంబానికి తోటి కేబుల్ ఆపరేటర్లు అండగా నిలిచారు. బాధిత కుటుంబానికి తమ వంతు సహాయంగా రూ.10,016 నగదు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కేబుల్ ఆపరేటర్లు మాట్లాడుతూ, తమలో ఒకరైన రామ్మూర్తి ఆర్థిక సమస్యల కారణంగా మృతి చెందడం ఎంతో బాధాకరమని అన్నారు. రామ్మూర్తి కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని, వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు కేబుల్ ఆపరేటర్ల సంఘం కట్టుబడి ఉంటుందని తెలిపారు. అనంతరం రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ రెండు నిమిషాల మౌనం



పాటించారు. ఈ కార్యక్రమంలో పొనగంటి వెంకన్న, దాసరి సదానంద్, అక్కినపల్లి నవీన్ కుమార్, మదెర్ల కుమారస్వామి, ఆముదాల ధనంజయ్, హౌసింగ్ బోర్డ్ కుమారస్వామి, ఎరకొండ నారాయణ, సంజీవ్, సాంబయ్యతో పాటు పలువురు టౌన్ కేబుల్ ఆపరేటర్లు పాల్గొన్నారు

## విద్యార్థుల దెబ్బతో కదిలి న ఢిల్లీ బిజెపి ప్రభుత్వ పీఠం

**రాజపేట జులై: 25(తెలంగాణ వాణి విలేకరి)**
నీటి విద్యార్థుల దెబ్బతో కరీంనగర్ ఢిల్లీ బిజెపి ప్రభుత్వ పీఠం భారతదేశ విద్యార్థుల ఘనవిజయంగా భావిస్తూ బిజెపి ప్రభుత్వ అహంకారాన్ని మెడలు వంచి భారత విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ను రాజీనామా చేసే అంతవరకు భారతదేశ దేశ నీట్ పరీక్ష విద్యార్థులు యువత ఢిల్లీ జంతర్ మంతర్ వేదికగా విద్యార్థుల ప్రాణాలు లెక్కచేయకుండా దేశ యువత సాధించిన ఘనవిజయం.



ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ గుఱ్ఱం నర్సింహులు అన్నారు. గడిచిన 12 సంవత్సరాలలో నిత్యవసర సరుకుల పెట్రోల్ డీజిల్ బంగారం ధరలు ఆకాశాన్ని అందాయి అదేవిధంగా రూపాయి విలువ పతనం అయిపోయింది బిజెపి ప్రభుత్వ నిరంకుశ పాలన కు రాబోయే రోజుల్లో దేశ ప్రజలు బిజెపి ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది అన్నారు.

## బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడి నియామకం



**తిమ్మాపూర్, జూలై 25, ( తెలంగాణ వాణి ప్రతినిధి)**
కరీంనగర్ బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా బత్తుల లక్ష్మీనారాయణ నియమితులయ్యారు. ఈ మేరకు బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు క్రాంతి కిరణ్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. బత్తుల లక్ష్మీనారాయణ గతంలో బీజేపీ కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా, చొప్పదండి మండలం గుమ్లాపూర్ ఎంపీటీసీగా సేవలందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో బిజెపి, ఎస్సీ మోర్చా బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. కరీంనగర్ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు క్రాంతి కిరణ్, తన నియామకానికి సహకరించిన రాష్ట్ర, జిల్లా నాయకుల ందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

## ఘనంగా బీరప్ప బోనాలు

**డప్పు సప్పులతో జమ్మికుంట వీధులు హోరెత్తాయి**



**జమ్మికుంట జులై 25,(తెలంగాణ వాణి ప్రతినిధి) :**
జమ్మికుంట పట్టణంలోని అంగరంగ వైభవంగా బీరప్ప బోనాలు జరిగాయి. ఆబాది జమ్మికుంటలో డప్పు సప్పులతో, పూజా సామగ్రితో భక్తులు బోనాలు ఎత్తుకున్నారు. ఆబాది జమ్మికుంట పురవీధుల గుండా ఊరేగింపుగా బీరప్ప గుడికి చేరుకున్నారు. అక్కడ బీరప్పకు ముక్కలు చెల్లించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బీరప్పను దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఈ కార్యక్రమంలో కురుమ కులస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బోనాలు సమర్పించి, బీరప్పను దర్శించుకుని ముక్కలు అప్పజెప్పారు. మహిళలు సంప్రదాయ దుస్తుల్లో బోనాలు మోస్తూ బీరప్పకు నైవేద్యాలు సమర్పించారు.

## రంగారెడ్డి జిల్లా బీజేపీ కౌన్సిల్ సభ్యుడిగా గుండె గణేష్ ముదిరాజ్ నియామకం

**హైదరాబాద్/శేరిలింగంపల్లి, జూలై 25 (తెలంగాణ వాణి విలేకరి):**
శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని మియాపూర్ డివిజన్‌కు చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు గుండె గణేష్ ముదిరాజ్‌ను రంగారెడ్డి జిల్లా బీజేపీ కౌన్సిల్ సభ్యుడిగా పార్టీ అధిష్ఠానం నియమించింది. ఈ సందర్భంగా గణేష్ ముదిరాజ్ మాట్లాడుతూ, పార్టీ పట్ల



అంకితభావంతో పనిచేస్తూ ప్రజాసేవలో కొనసాగుతున్న తన సేవలను గుర్తించి ఈ బాధ్యత అప్పగించడం ఆనందంగా ఉందన్నారు. తనపై నమ్మకం ఉంచిన శేరిలింగంపల్లి ఇన్‌చార్జి రవికుమార్ యాదవ్, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు, స్థానిక నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ తనపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని పేర్కొన్నారు.

## రఘునాధపురంలో తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా నగర సంకీర్తన



**రాజపేట జులై: 25(తెలంగాణ వాణి విలేకరి)**
యాదాద్రి భువనగిరి జిల్లా రాజపేట మండలం రఘునాథపురం గ్రామంలో మర్కుకు శ్రీ శ్రీ శ్రీ యతివర భావానంద భారతి స్వామి వారి అనుగ్రహంతో, శ్రీ విశ్వనాథ గురుదేవుల ఆశీస్సులతో శ్రీ అదరాసు శ్రీధర్ శర్మ వారి పర్యవేక్షణలో పాండురంగ ఆశ్రమం కేంద్రంగా నిర్వహిస్తున్న ,శతకోటి హరే రామ నామ జప యజ్ఞం పురస్కరించుకొని, గ్రామ గ్రామానికి జరుగుతున్న ఏకాదశి నగర సంకీర్తనలో భాగంగా, రఘునాధపురం భగత్సేవా సమాజం శాఖ ఆధ్వర్యంలో శనివారం తొలి ఏకాదశి పర్వదినాన్ని పునస్కరించుకొని, భగవత్ భక్తులందరూ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం నుండి, ప్రధాన వీధుల గుండా శివాలయం వరకు, శివాలయం నుండి రామాలయం ప్రధాన వీధుల గుండా శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం వరకు హరే రామ నామ మంత్రాన్ని జపిస్తూ నగర సంకీర్తన నిర్వహించి భగవాన్ నామం ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో వల్లకాటి బాబురావు, సామల భాస్కర్,కటకం సంతోష్ , బింగి శివరాజ్ బింగి పాండురంగం చేన్న బాల సిద్ధులు, ఆడేపు శివ ,మాదూరి సునంద భోగ మాధురి , బింగి శకుంతల, రేగొండ పద్మావతి,సామల రమేష్, చేన్న నరసింహులు , బూరెల శ్రీను, చెన్న నర్సింగరావు భోగ గిరి,కటకం శ్రీనివాస్, రేగొండ వెంకటేశం, కటుకం గణేశ్,దుడుక బాలాజీ, బల్ల వివేక్, బెజగం ఆత్మలింగం, కటుకం హరినాథ్, ఉప్పల రమేష్, , లోక శ్రీనివాస్, లోక వెంకటేశం, వెంగల్ దాస్ నాగేష్ , వీరబత్తినీ విజయ్,భోగ మహేష్,మాదురీ బాలయ్య, భోగ వెంకటేశం,బొడ్డు పందరి,లు భక్తులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రతి ఫిర్యాదుపై చట్టపరమైన చర్యలు తప్పనిసరి: డీఐజీ ఆర్. భాస్కరన్



**జగిత్యాల, జూలై 25 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
ప్రతి ఫిర్యాదును చట్టపరంగా నమోదు చేసి సత్వర చర్యలు తీసుకోవాలని బాసర జోన్ డీఐజీ ఆర్. భాస్కరన్ పోలీసు అధికారులను ఆదేశించారు. శనివారం జగిత్యాల జిల్లాలో పోలీసింగ్, శాంతిభద్రతలు, నేర నియంత్రణ చర్యలపై సమగ్ర సమీక్ష నిర్వహించారు.జగిత్యాల రూరల్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన డీఐజీ ఎఫ్ఐఆర్‌లు, కేసు రికార్డులు, సీసీటీఎన్ఎస్ నమోదు, ప్రజా సేవలను పరిశీలించి, ప్రతి ఫిర్యాదుదారునితో మర్యాదగా వ్యవహరించాలని సూచించారు. శాస్త్రీయ దర్యాప్తుతో కోర్టుల్లో శిక్షల శాతం పెంచేలా కృషి చేయాలని తెలిపారు.జిల్లా పోలీసు కార్యాలయంలో స్పెషల్ బ్రాంచ్, ఐటీ కోర్, డీసీఆర్‌బీ పనితీరును సమీక్షిస్తూ, సోషల్ మీడియా వదంతులపై నిఘా, సైబర్ నేరాల దర్యాప్తులో ఆధునిక సాంకేతికత వినియోగించాలని ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయం, రూరల్ పోలీస్ స్టేషన్ నిర్వహణ సంతృప్తికరంగా ఉందని పేర్కొంటూ జిల్లా ఎస్పీ అశోక్ కుమార్‌తో పాటు పోలీసు సిబ్బందిని డీఐజీ అభినందించారు.

## వర్షాకాల వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి.

**- జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుజాత.**



**ఇబ్రహీంపట్నం జూలై 25 (తెలంగాణ వాణి విలేకరి)**
జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిడాక్టర్ సుజాత ఆకస్మికంగా జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంనుతనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలం సీజన్‌లో వచ్చే వ్యాధులపై అందరూ అప్రమత్తంగా ఉండాలనివైద్యాధికారులకుసూచించారు.గ్రామాల్లో తిరిగే క్షేత్రస్థాయి సిబ్బంది అందరూ ప్రజలకు సీజనల్ వ్యాధులపై విస్తృత అవగాహన కల్పించాలని ఆమె తెలిపారు.ముఖ్యంగా దోమల ద్వారా వచ్చే మలేరియా, డెంగ్యూ, చికెన్‌గునియా, ఫైలేరియా వంటి వ్యాధులు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.గ్రామ సందర్శనలో భాగంగా ఇంటి చుట్టుపక్కల అనవసరంగా నీరు నిల్వ ఉండకుండా చూడాలని,కూలర్లు, టైర్లు,కొబ్బరి చిప్పలు, ప్లాస్టిక్ సామాన్లలో నీరు నిల్వ లేకుండా చూడాలని ఆదేశించారు.వారంలో ఒకసారి డ్రై డే పాటించి నీటినిల్వలనుతొలగించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.జ్వరం లక్షణాలు కనిపించిన వెంటనే సమీపంలోని పి హెచ్ సి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని, స్వీయ వైద్యం చేసుకోవద్దని డాక్టర్ సుజాత కోరారు. ఈ కార్యక్రమంలో సంబంధిత జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ నరేంద్ర,వైద్యాధికారి, సూపర్వైజర్లు,సిబ్బంది పాల్గొన్నారు.

## ఉస్మాన్‌నగర్ శివాలయంలో అన్నప్రసాద వితరణ

**తెల్లాపూర్ జూలై 25 (తెలంగాణ వాణి ప్రతినిధి)**





ఉస్మాన్‌నగర్‌లోని శ్రీ కాశీ విశ్వనాథ శివ పంచాయతన దేవాలయంలో తొలిఏకాదశి సందర్భంగా శనివారం భక్తిశ్రద్ధలతో అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. రాజ్ పుష్ప నివాసి బోడకుంట ప్రవీణ్, శ్రీమతి శ్రీవిద్య దంపతులు శివాలయ ప్రాంగణంలో భక్తులకు అన్నప్రసాదాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన భక్తులు భోజన ప్రసాదం, తాంబూలాలు స్వీకరించి దంపతులను హృదయపూర్వకంగా ఆశీర్వదించారు. శివాలయ వాతావరణం భక్తి పారవశ్యంతో కళకళలాడగా, కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా జరిగింది.
అన్నదానం మహాదానంగా భావిస్తూ ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించిన బోడకుంట ప్రవీణ్, శ్రీమతి శ్రీవిద్య దంపతులను భక్తులు అభినందించారు.

# నేడే కొమురవెల్లి రైల్వే స్టేషన్ ప్రారంభోత్సవం...!

**కొమురవెల్లి జులై 26(తెలంగాణ వాణి ప్రతినిధి)**
తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కొమురవెల్లి మల్లన్న ఆలయానికి వచ్చే లక్షలాది మంది భక్తుల సౌకర్యార్థం నిర్మించిన రైల్వే స్టేషన్ ప్రారంభానికి ముహూర్తం ఖరారైంది. రేపు ఆదివారం ప్రధాని నరేంద్ర మోదీ, వర్చువల్ గా రైల్వే స్టేషన్ ప్రారంభించనున్నారు..అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు రైల్వే స్టేషన్ వద్ద నిర్వహించే కార్యక్రమానికి కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఎంపీలు చామల కిరణ్ కుమార్ రెడ్డి, రఘునందన్ రావు, ఎమ్మెల్యే పలె రాజేశ్వర్ రెడ్డి, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, దక్షిణ మధ్య రైల్వే ఉన్నత అధికారులు హాజరుకానున్నారు. కొమురవెల్లి మల్లన్న ఆలయాన్ని సందర్శించే భక్తుల సౌకర్యార్థం, మనోహ రాబాద్--సిద్దిపేట కొత్త రైల్వే మార్గంలో మనోహరాబాద్--కొత్తపల్లి రైలు మార్గం ప్రాజెక్టులో భాగంగా ఈ నూతన రైల్వే స్టేషన్‌ను నిర్మించారు. సుమారు రూ.6 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ స్టేషన్‌లో హై లెవెల్ ప్లాట్‌ఫారమ్, ప్లాట్‌ఫారమ్ షెల్టర్, ప్రయాణికుల వేచి ఉండే గది, తాగునీటి




సౌకర్యం, విద్యుత్ దీపాలు, ఇతర ప్రాథమిక వసతు లను కల్పించారు. భక్తులు, ప్రయాణికు లు సౌకర్యవంతంగా ప్రయాణించేలా ఆధునిక ప్రమాణాలతో స్టేషన్‌ను నిర్మించారు.ప్రస్తుతం సికింద్రాబా ద్--సిద్దిపేట మధ్య నాలుగు డెమూ రైళ్లు నడుస్తుండగా, వాటికి కొమురవెల్లి పుణ్యక్షేత్రం స్టేషన్‌లో అదనపు స్టాప్ స్టేజీ కల్పించారు. ప్రారంభోత్సవం



సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఇతర ప్రముఖులతో కలిసి సిద్దిపేట-- సికింద్రాబాద్ డెమూ రైలు నంబర్ 77654 ను కొమురవెల్లి పుణ్యక్షేత్రం స్టేషన్ నుంచి జెండా ఊపి ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి కొమురవెల్లి మండల ప్రజలు మరియు ఇతర మండల ప్రజలు అత్యదిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## చింతలపేట హత్య బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటాం

- ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య
- బాధిత కుటుంబానికి ఎస్సీ, ఎస్టీ చట్టం ప్రకారం పరిహారం, అన్ని ప్రభుత్వ సహాయాలు అందించాలి
- నిందితులకు జీవిత ఖైదు పడేలా ఫాస్ట్ ట్రాక్ కోర్టులో విచారణ చేపట్టాలి

**జగిత్యాల: జూలై 25 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
చింతలపేట గ్రామంలో హత్యకు గురైన బాధితురాలి కుటుంబానికి న్యాయం జరిగేలా అన్ని చర్యలు తీసుకోవాలని, నిందితులకు చట్టప్రకారం జీవిత ఖైదు పడేలా అధికారులు సమర్థవంతంగా వ్యవహరించాలని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అధికారులను ఆదేశించారు.తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య శనివారం మెట్‌పల్లి మండలం చింతలపేట గ్రామంలో హత్యకు గురైన కర్రె సునీత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసి, ధైర్యంగా ఉండాలని సూచించారు.ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ ఈ హత్య అత్యంత దారుణమైనదని, సభ్య సమాజం మొత్తం ఇటువంటి ఘటనలను ఖండించాలని అన్నారు. పరువు హత్యలు జుగుప్సాకరమైనవని, సమాజంలో ఇటువంటి ఘటనలకు ఏమాత్రం తావు ఉండకూడదని



పేర్కొన్నారు.అనంతరం హత్య కేసు దర్యాప్తు పురోగతిపై సంబంధిత పోలీసు, రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. కేసు దర్యాప్తును వేగవంతంగా పూర్తి చేసి, ఫాస్ట్ ట్రాక్ కోర్టులో విచారణ చేపట్టి నిందితులకు జీవిత ఖైదు పడేలా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నిందితులు ఎంతటి వారైనా చట్టం నుంచి తప్పించుకోకుండా, వారికి జీవిత ఖైదు పడే వరకు ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఈ కేసును పర్యవేక్షిస్తుందని స్పష్టం చేశారు. బాధితురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారని, వారి కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని తెలిపారు. కుటుంబానికి ఎస్సీ, ఎస్టీ (అత్యాచార నిరోధక) చట్టం ప్రకారం అందాల్సిన పరిహారం, పునరావాసం, ఇతర ప్రభుత్వ సహాయాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడంతో పాటు అవసరమైన అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గత వారం రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ , సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ బాధిత కుటుంబానికి తక్షణ సహాయంగా రూ.4,12,500/- పరిహారం అందజేశారని తెలిపారు. చార్జిషీట్ దాఖలు చేసిన అనంతరం ఎస్సీ, ఎస్టీ (అత్యాచార నిరోధక) చట్టం ప్రకారం మిగిలిన పరిహారం కూడా విడుదల చేయడంతో పాటు బాధితురాలి పిల్లలకు రెసిడెన్షియల్ పాఠశాలల్లో ప్రవేశాలు, ప్రభుత్వ ఉద్యోగానికి సంబంధించిన నిబంధనల మేరకు సహాయం, ఇందిరమ్మ ఇల్లు, ప్రభుత్వం తరఫున అందాల్సిన ఇతర అన్ని సహాయ సహకారాలు అందేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.అనంతరం క్షేత్ర పర్యటనలో ఉన్న జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్, మెట్పల్లి లోనీ విధిత్ రెడ్డి గార్డెన్ లో మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్క అందజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్.లత, ఆర్.డి.ఓ. నరసింహారావు, డీఎస్పీ రాములు ,ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యులు, ప్రవీణ్, నీలాదేవి, రాంబాబు, శంకర్, ఎస్సీ వెల్ఫేర్ అధికారి రాజకుమార్, ఈడి ఎస్సీ కార్పొరేషన్ కిషోర్, తాశీల్దార్ నీతా, స్థానిక ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# తోటపల్లిలో ఘనంగా గోరింటాకు వేడుకలు

- ఆషాఢంలో గోరింటాకు ఆరోగ్యానికి ఎంతో మేలు
- గోరింటాకు వేడుకల్లో సర్పంచ్ బంక లక్ష్మి చందు

**హుస్నాబాద్,రూరల్ జూలై 25( తెలంగాణ వాణి )**
హుస్నాబాద్ మండలం తోటపల్లి గ్రామంలో ఆషాఢ మాసం సందర్భంగా గోరింటాకు వేడుకలు సంప్రదాయబద్ధంగా, ఉత్సాహభరితంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ బంక లక్ష్మి చందు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ మహిళలు, యువతులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని పండుగ వాతావరణాన్ని సృష్టించారు.గ్రామ పరిసరాల్లోని తాజా గోరింటాకు ఆకులను సేకరించి, వాటిని సంప్రదాయ పద్ధతిలో రుబ్బి ఒకరికి ఒకరు గోరింటాకు అద్దుకున్నారు ఆట పాటలు, జానపద గోరింటాకు గీతాలతో మహిళలు ఆనందోత్సాహాల మధ్య వేడుకలను జరుపుకున్నారు. గ్రామమంతా సాంప్రదాయ సంస్కృతిని ప్రతిబింబించేలా సందడి నెలకొంది.ఈ సందర్భంగా సర్పంచ్ బంక లక్ష్మి చందు మాట్లాడుతూ ఆషాఢ మాసంలో గోరింటాకు పెట్టుకోవడం తెలుగు సంస్కృతిలో ప్రత్యేకమైన



సంప్రదాయమని అన్నారు. గోరింటాకు శరీరానికి చల్లదనాన్ని అందించడంతో పాటు చర్మ ఆరోగ్యాన్ని కాపాడుతుందని, మహిళల ఐక్యత, ఆనందానికి ప్రతీకగా ఈ వేడుకలు నిలుస్తాయని పేర్కొన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు పరిచయం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆమె ఈకార్యక్రమాన్ని ఉద్దేశించి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో



ఉపసర్పంచ్ పోలు రాజు, వార్డు సభ్యులు మానుక కుమార్, పోషవేణి కుమార్, శాతవేణి అనూష చందు, బొంగోని రేణుక రమేష్, పోగుల కవిత సత్యం, కొంగరి స్వరూప మల్లేశం, గుల్ల ఎల్లవ్వ లక్ష్మయ్య, అంగన్‌వాడీ టీచర్ గాదాసు విమల, ఆశా వర్కర్ కోతి వెంకటలక్ష్మి, సి.ఏ. వల్లపు రేణుక, వీవో అధ్యక్షురాలు దొంతర వేణి జ్యోతి, పోసవేని రాధికతో పాటు గ్రామ మహిళలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రతి కాలనీ సమగ్ర అభివృద్ధే లక్ష్యం: ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

- అమీన్పూర్‌లో రూ.80 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించడమే ప్రథమ ప్రాధాన్యత

**పటాన్ చెరు, జూలై 25, (తెలంగాణ వాణి):**
అమీన్పూర్ పరిధిలోని ప్రతి కాలనీ సమగ్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. శనివారం అమీన్పూర్ డివిజన్‌లోని ఆర్ఆర్ హోమ్స్, ఎస్ఎస్ అపార్ట్‌మెంట్, దుర్గా హోమ్స్ కాలనీలలో రూ.80 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, అంతర్గత మురుగు నీటి కాలువల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నూతన కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించడమే తమ ప్రథమ ప్రాధాన్యత అని పేర్కొన్నారు. అమీన్పూర్ లో మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా పైప్‌లైన్ విస్తరణ పనులు, డ్రైనేజీ



వ్యవస్థ అభివృద్ధి, సీసీ రోడ్ల నిర్మాణం వంటి పనులను దశలవారీగా చేపడుతున్నట్లు వెల్లడించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రతి కాలనీలో మౌలిక వసతులను కల్పించి, అమీన్పూర్ ను ఆదర్శవంతమైన నివాస ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ఎన్నికల సంఘం చేపడుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రతి ఓటరు పాల్గొని.. తమ వివరాలను నమోదు చేసుకోవాలని ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. స్థానికంగా



నమోదు చేసుకునే ప్రతి ఓటు అభివృద్ధికి పునాది లాంటిదని తెలిపారు. పటాన్ చెరు అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండు రంగారెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు చంద్రకళ గోపాల్, కృష్ణ, ప్రమోద్ రెడ్డి, జగదీష్, రాజు, చంద్రశేఖర్, రుశ్వంత్ రెడ్డి, దాసు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## కొల్లూరు శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో తొలి ఏకాదశి వేడుకలు

**తెల్లాపూర్ జూలై 25 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
కొల్లూరు శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొలి ఏకాదశి సందర్భంగా తెల్లవారుజాము నుంచే ఆలయానికి భక్తులు భారీగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. తొలి ఏకాదశి రోజున శ్రీ వెంకటేశ్వర స్వామి ని భక్తితో ఆరాధిస్తే సకల శుభాలు కలుగుతాయని భక్తుల విశ్వాసం. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం గోవింద నామస్మరణతో మార్మోగింది. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి దర్శన ఏర్పాట్లు సక్రమంగా నిర్వహించారు. తొలి ఏకాదశి వేడుకలు భక్తి పారవశ్యంతో వైభవంగా సాగాయి







## కాళేశ్వరం దేవస్థానం ఆధ్వర్యంలో సోమవారం వరుణ యాగం

**మహదేవపూర్, జూలై 25 (తెలంగాణ వాణి):**
కాళేశ్వరం శ్రీ ముక్తీశ్వర స్వామి దేవస్థానం బాలాలయంలో సోమవారం వరుణ యాగం నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వేద పండితుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా ఈ యాగం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని, ప్రజలు సుభిక్షంగా ఉండాలని, పంటలు బాగా పండాలని ఆకాంక్షిస్తూ వరుణ యాగం నిర్వహిస్తున్నట్లు వేద పండితులు తెలిపారు.

## ఇస్నాపూర్ మున్సిపాలిటీలో మౌళిక వసతుల కల్పన కై కమీషనర్‌తో భేటీ

**మెట్టు శ్రీధర్**



**పటాన్ చెరు, జులై 25, (తెలంగాణ వాణి):**
ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న పలు మౌలిక సమస్యలను తక్షణమే పరిష్కరించి, మున్సిపాలిటీ ని పరిశుభ్రమైన, హరిత, ఆధునిక మరియు ప్రజలకు అన్ని మౌలిక సదుపాయాలు కల్పించే ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దాలని నవభారత్ నిర్మాణ్ యువసేన వ్యవస్థాపక అధ్యక్షులు, తెలంగాణ యువజన సంఘాల సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెట్టు శ్రీధర్ మున్సిపల్ కమిషనర్ ను కోరారు.మున్సిపాలిటీ పరిధిలో అనేక ప్రాంతాల్లో ఇంటి నంబర్ల కేటాయింపులో అస్పష్టత, పునరావృత నంబర్లు, నంబర్లు లేకపోవడం వంటి సమస్యల వల్ల ప్రజలు ఆస్తి పన్ను చెల్లింపులు, విద్యుత్, తాగునీటి కనెక్షన్లు, బ్యాంకు రుణాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఇతర అధికారిక సేవలను పొందడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రత్యేక సర్వే నిర్వహించి ఇంటి నంబర్ల సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని కోరారు. ఇస్నాపూర్ మున్సిపాలిటీ ని పరిశుభ్రమైన, హరిత, ప్లాస్టిక్ రహిత మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ప్రతి వార్డులో క్రమబద్ధమైన చెత్త సేకరణ, మొక్కల పెంపకం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగ నియంత్రణ తో పాటు ప్రజల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని అనేక కాలనీల్లో అంతర్గత సీసీ రోడ్లు, సమగ్ర డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం వల్ల ముఖ్యంగా వర్షాకాలంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. అవసరమైన ప్రాంతాల్లో నాణ్యమైన సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని కోరారు.అదేవిధంగా పిల్లలు, మహిళలు, యువత మరియు వృద్ధుల ఆరోగ్యకర జీవనశైలిని ప్రోత్సహించేలా ప్రతి వార్డు లేదా కాలనీలో పార్కులు, వాకింగ్ ట్రాక్‌లు, ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.అలాగే మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి చెందుతున్న కొత్త కాలనీలు మరియు కొత్తగా నిర్మించిన ఇండ్లకు ఇప్పటికీ మున్సిపల్ తాగునీటి కనెక్షన్లు అందుబాటులో లేని ప్రాంతాలను గుర్తించి, అవసరమైన పైప్‌లైన్ విస్తరణ చేపట్టి, అర్హులైన ప్రతి ఇంటికి త్వరితగతిన తాగునీటి కనెక్షన్లు మంజూరు చేయాలని కోరారు. ప్రజలకు సురక్షితమైన తాగునీటి సరఫరా అందించడం మున్సిపాలిటీ ప్రాధాన్యతగా ఉండాలని సూచించారు.ఇస్నాపూర్ మున్సిపాలిటీని రాష్ట్రంలోనే ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు మరియు ప్రజలు సమిష్టిగా కృషి చేయాలని మెట్టు శ్రీధర్ ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో శ్రీకాంత్ శివశంకర్ తదితరులు పాల్గొన్నారు

## కొండగట్టు అంజన్నను దర్శించిన ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

### రాష్ట్ర సుభిక్షం.. రైతులకు సమృద్ధి పంటల కోసం ప్రత్యేక పూజలు





**జగిత్యాల: జులై 25 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
తెలంగాణ రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో జీవించాలని, రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు పండించిన పంటలు బాగా పండాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య శనివారం కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా పర్యటనలో భాగంగా కొండగట్టు హరిత హోటల్‌కు చేరుకున్న ఆయనకు అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్. లత పూలమొక్క అందించి స్వాగతం పలికారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన చైర్మన్ ఆలయానికి చేరుకోగా, అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికి వేదమంత్రోచ్ఛారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బక్కి వెంకటయ్య మాట్లాడుతూ, కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకోవడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు.రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు పండించిన పంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. ప్రతి సంవత్సరం వేలాది మంది భక్తులు దీక్షలు చేపట్టి కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకోవడం ఈ క్షేత్రం ప్రత్యేకత అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి.ఎస్. లత, డీఎస్పీ రాములు, ఎస్సీ--ఎస్టీ కమిషన్ సభ్యులు, ఎస్సీ వెల్ఫేర్ అధికారి రాజకుమార్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ కిషోర్, డీపీఆర్ఓ వి. శ్రీధర్, తహసీల్దార్, ఈవో అంజనా రెడ్డి, ఆలయ అధికారులు, జిల్లా అధికారులు, పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కిక్ బాక్సింగ్ నూతన కమిటీ ఎన్నుకోబడును



**వనపర్తి : జూలై 25, (తెలంగాణ వాణి ప్రతినిధి)**
వనపర్తి పట్టణ కరాటే, కిక్ బాక్సింగ్ మాస్టర్లకు ఆహ్వానం సోమవారం రోజు ఉదయం 9గంటలకు వనపర్తి పట్టణ పాత బస్టాండు లలిత కళాతోరణం ఆవరణంలోవనపర్తి జిల్లా కిక్ బాక్సింగ్ అసోసియేషన్ నూతన కమిటీని ఎన్నుకోబడును ఆసక్తిగల మాస్టర్లు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని తెలంగాణ రాష్ట్ర కిక్ బాక్సింగ్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి, వనపర్తి జిల్లా కిక్ బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షులు కరాటే శేఖర్ తెలిపారు.

## ఈశ్వరమ్మకు అభినందనలు.. అవమానకర వ్యాఖ్యలపై ఖండన

**చౌటుప్పల్, జూలై 25(తెలంగాణ వాణి డివిజన్ ప్రతినిధి)**
యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం బోర్డు సభ్యురాలిగా నియమితులైన పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్ ను చౌటుప్పల్ మండల యాదవ సంఘం నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు శాలువా కప్పి ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.ఇటీవల ఈశ్వరమ్మ యాదవ్‌పై జరిగిన అవమానకర వ్యాఖ్యలను మండల యాదవ సంఘం నాయకులు తీవ్రంగా ఖండించారు. సమాజానికి సేవ చేస్తున్న మహిళా నాయకుల పట్ల వ్యక్తిగత విమర్శలు, అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని పేర్కొన్నారు. ప్రజా జీవితంలో ఉన్నవారిపై విమర్శలు హుందాగా, వాస్తవాల ఆధారంగా ఉండాలని, వ్యక్తిత్వాన్ని కించపరిచే వ్యాఖ్యలు సమాజానికి మంచివి కావని అభిప్రాయపడ్డారు.యాదవ సమాజం ఎల్లప్పుడూ ఈశ్వరమ్మ యాదవ్‌కు అండగా ఉంటుందని, ఆమె దేవస్థానం బోర్డు సభ్యురాలిగా బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి భక్తులకు, సమాజానికి మరింత సేవ అందించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో అఖిల భారత యాదవ మహాసభ భువనగిరి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ యాదవ్, మండల యాదవ సంఘ గౌరవ అధ్యక్షుడు నల్ల పర్వతాలు యాదవ్, యాదవ సంఘం మండల అధ్యక్షుడు చినుకని మల్లేశం యాదవ్,



ప్రధాన కార్యదర్శి గంగసబోయిన వెంకటేష్ యాదవ్, గొర్లకాపరుల సంఘం జిల్లా డైరెక్టర్ నల్ల గణేష్ యాదవ్, ఉపాధ్యక్షుడు గజ్జి పాండు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## రాజకీయాలకతీతంగా "సర్ "ను నిర్వహించాలి

**వరంగల్ పశ్చిమ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి**
**తెలంగాణ వాణి, ఉమ్మడి వరంగల్ బ్యూరో, (జూలై 25) :**
రాజకీయాల కతీతంగా ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ– "సర్" ను నిర్వహించాలని వరంగల్ పశ్చిమ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి సూచించారు.శనివారం పూలే ఆశయ సాధన సమితి ఆధ్వర్యంలో కాకతీయ విశ్వవిద్యాలయం దూరవిద్య కేంద్రంలో జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ విభాగాధిపతి డాక్టర్ సంగని మల్లేశ్వర్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ చైతన్యవంతమైన తెలంగాణలో మిగతా రాష్ట్రాల మాదిరిగా ఓటర్ల తొలగింపు కుటిలయత్నాలు చెల్లవని, వారం రోజులపాటు ప్రజా సంఘాలు, సామాజిక ఉద్యమకారులు అప్రమత్తంగా ఉండాలని కోరారు.పాస్ ఆధ్వర్యంలో 'సర్' ప్రక్రియ పై నిర్వహించిన సెమినార్ లో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు.గ్రామీణ ప్రాంతాలతో పోల్చితే నగరాల్లో సర్ ప్రక్రియ మందకొడిగా కొనసాగుతున్నదని అన్నారు.తమ నియోజకవర్గంలో బిఎల్ఓ లు, బి ఎల్ ఎ ల సహకారంతో ఇప్పటివరకు 58 శాతం సర్ ప్రక్రియ పూర్తి చేయించామని,ఇంకా వారం రోజుల సమయంలో 80 శాతం ప్రక్రియ పూర్తి చేయనున్నట్లు తెలిపారు.ఓటు ద్వారానే మన నిర్ణయాన్ని ప్రకటించే అవకాశం ఉన్నందున అర్హులందరూ సర్ ప్రక్రియలో భాగస్వాములు కావాలని రాజేందర్ రెడ్డి చెప్పారు.రాజకీయాలకు



అతీతంగా రాజకీయ పార్టీలు విద్యార్థులు, మేధావులు,అన్ని వర్గాల వారు ఓటు నమోదు ప్రక్రియలో పాల్గొనాలని ఆయన అభ్యర్థించారు.ఇ ఫ్లూ ప్రొఫెసర్ డాక్టర్ రాజారాం మాట్లాడుతూ సర్ ప్రక్రియ లో అందరూ భాగస్వాములు కావాలని కోరారు.ఆగస్టు 3 వరకు ఈ ప్రక్రియ పూర్తికానుందని, ఆగస్టు 8వ తేదీన డ్రాఫ్ట్ నోటిఫికేషన్ వెలువడుతుందని వివరించారు. 141 కోట్ల జనాభాకు సర్ ప్రక్రియ కొనసాగుతుందని, రెండో విడతలో ఆరు రాష్ట్రాలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాల్లో సర్ ప్రక్రియ కొనసాగుతుందన్నారు.తెలుగు అకాడమీ చైర్మన్ ప్రొఫెసర్ వెంకటనారాయణ మాట్లాడుతూ సర్ ఫారం లో ఉన్న సంక్లిష్టత లను తొలగించాలన్నారు.యువత పౌర సమాజం బాధ్యత తీసుకొని ప్రతి ఒక్కరూ ఓటు హక్కును కాపాడుకునే విధంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఉస్మానియా విశ్వవిద్యాలయం రాజనీతి శాస్త్రం ప్రొఫెసర్ వెంకటేశ్వర్లు,రచన జర్నలిజం కళాశాల ప్రిన్సిపల్ ఆర్. ఉమామహేశ్వర్ మాట్లాడుతూ సర్ ప్రక్రియ పై మీడియా ప్రజలను మరింత చైతన్యవంతులను చేయాల్సి ఉందని అలాగే ముసాయిదా ఓటర్ల జాబితా విడుదలైన తర్వాత కూడా అభ్యంతరాలు ఉంటే పరిష్కరింప చేసేలా మీడియా కృషి చేయాలని పిలుపునిచ్చారు.డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ జర్నలిజం విభాగం అధ్యాపకులు డా.యాదగిరి మాట్లాడుతూ ప్రజాస్వామ్యం బలోపేతం కు సర్ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు.ఈ సందర్భంగా ఆచార్య కూరపాటి వెంకట్ నారాయణ చైర్మన్ అకాడమీ, తెలంగాణ గారిని ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో కేయూ మాజీ రిజిస్ట్రార్ సదానందం, డాక్టర్ కూరపాటి రమేష్, పాస్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చందా మల్లయ్య, జిల్లా ఉపాధ్యక్షులు మెరుగు బాబు యాదవ్, ఉపాధ్యాయులు దామెర ఉపేందర్, రాజ్ మహమ్మద్,పాస్ నాయకులు డాక్టర్ తాడూరి శాస్త్రి,గౌడిశాల సత్యనారాయణ గౌడ్, డాక్టర్ నల్లాని శ్రీనివాస్, జర్నలిజం విభాగం అధ్యాపకులు కంజర్ల నరసింహారాములు,డాక్టర్ వంగాల సుధాకర్, డాక్టర్ సంపత్ కుమార్,డి.రామాచారి, డా. మోటె చిరంజీవి, సురేందర్, శ్రవణ్ తో పాటు అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రత్యామ్నాయ పంటల సాగుకు రైతులు సిద్ధం కావాలి

**రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డా. జిల్లెల్ల చిన్నారెడ్డి**
**వనపర్తి, జూలై 25, (తెలంగాణ వాణి ప్రతినిధి)**
ఎల్‌నినో ప్రభావం, తక్కువ వర్షపాతం పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు వరి సాగుకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డా. జిల్లెల్ల చిన్నారెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు.శనివారం వనపర్తి జిల్లా గోపాల్పేట మండలం జయన్న తిరుమలాపూర్ గ్రామంలో ఎల్‌నినో ప్రభావం, పంట మార్పిడి పై నిర్వహించిన రైతు గ్రామసభలో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డా. జిల్లెల్ల చిన్నారెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ముఖ్య అతిథులుగా పాల్గొని రైతులకు అవగాహన కల్పించారు.డా. జిల్లెల్ల చిన్నారెడ్డి మాట్లాడుతూ, వాతావరణ మార్పుల ప్రభావం కారణంగా సంప్రదాయ సాగు విధానాల్లో మార్పులు చేసుకోవాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. రైతులు కేవలం దిగుబడినే కాకుండా పెట్టుబడి, నీటి లభ్యత, మార్కెట్ అవకాశాలను కూడా దృష్టిలో ఉంచుకుని పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు.ఎల్‌నినో ప్రభావాన్ని ముందుగానే అంచనా వేసి ప్రభుత్వం తీసుకుంటున్న అవగాహన కార్యక్రమాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఒకే పంటపై ఆధారపడకుండా పంట మార్పిడి ద్వారా నష్టాలను తగ్గించుకోవడంతో పాటు స్థిరమైన ఆదాయాన్ని పొందవచ్చని తెలిపారు.వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు ప్రతి గ్రామంలో రైతులకు అవసరమైన సాంకేతిక సూచనలు అందించేందుకు సిద్ధంగా ఉన్నారని, ఏ సందేహం వచ్చినా అధికారులను సంప్రదించాలని సూచించారు. భూసార పరీక్షలు చేయించుకుని వాటి ఆధారంగా ఎరువులు వినియోగిస్తే సాగు వ్యయం తగ్గి దిగుబడి పెరుగుతుందని వివరించారు.వర్షపు నీటిని ప్రతి గ్రామంలో సంరక్షించుకోవడం భవిష్యత్ తరాలకు కూడా ఉపయోగపడుతుందని, రైతులు ఫార్మ్ పాండ్లు, ఇంకుడు గుంటలు,




సూక్ష్మ నీటిపారుదల పద్ధతులను విస్తృతంగా వినియోగించాలని పిలుపునిచ్చారు. ప్రకృతి పరిస్థితులకు అనుగుణంగా శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులను అనుసరిస్తే ఎలాంటి ప్రతికూల పరిస్థితులనైనా విజయవంతంగా ఎదుర్కోవచ్చని ఆయన అన్నారు.ఎల్‌నినో ప్రభావం వల్ల వర్షపాతం తగ్గే అవకాశాలు ఉన్నందున రైతులు వరి కాకుండా కందులు, పప్పుధాన్యాలు, కూరగాయలు, ఇతర ఉద్యాన పంటల సాగుపై దృష్టి పెట్టాలని సూచించారు. వ్యవసాయం, ఉద్యాన శాఖ అధికారుల సలహాలు తీసుకొని శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేయాలని, అధికారులు ఎల్లప్పుడూ రైతులకు అందుబాటులో ఉంటారని తెలిపారు. నీటి వృథాను నివారించి ప్రతి నీటి చుక్కను పొదుపుగా వినియోగించాలని, విద్యుత్ వినియోగంలో కూడా పొదుపు పాటించాలని సూచించారు.పంట పండించడంలో రైతులు ఎరువుల వినియోగాన్ని కూడా తగ్గించాలని, అధికంగా ఎరువుల వినియోగం వల్ల భవిష్యత్తులో భూముల సారం పై ప్రభావం పడే అవకాశం ఉందని సూచించారు. అదేవిధంగా ప్రతి ఒక్కరు మొక్కలు నాటడం బాధ్యతగా తీసుకోవాలని మొక్కలు నాటడం వల్ల పర్యావరణం సమతుల్యత పెరిగి వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని తెలియజేశారు. జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ, రాష్ట్ర



ఎల్‌నినో కమిటీ ఛైర్మన్‌గా డా. జిల్లెల్ల చిన్నారెడ్డి ఎంపిక కావడం జిల్లాకు ఎంతో గొప్ప విషయమని అన్నారు. జిల్లాలో ఈ సారి సుమారు 34 శాతం మేర కరవు పరిస్థితులు ఉన్నాయని, సంబంధిత మండలంలో అది 40 శాతం వరకు నమోదైందని తెలిపారు. ఈ ఏడాది వర్షపాతం ఆశించిన స్థాయిలో లేకపోవడంతో వర్షాధార సాగు చేసే రైతులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. జయన్న తిరుమలాపూర్ గ్రామంలో సుమారు 3 వేల ఎకరాల్లో సాగు జరుగుతుండగా, అందులో 700 ఎకరాలు పూర్తిగా వర్షాధారంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో వరి వంటి అధిక నీటి అవసరమున్న పంటల కంటే తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవడం రైతులకు ప్రయోజనకరమని సూచించారు. రాబోయే పరిస్థితులను ముందుగానే అంచనా వేసుకుని పంటల ప్రణాళిక రూపొందించుకోవాలని, సందేహాలుంటే వ్యవసాయ అధికారులను సంప్రదించి వారి సూచనల మేరకు సాగు చేపట్టాలని రైతులకు పిలుపునిచ్చారు.జిల్లా వ్యవసాయ అధికారి ఆంజనేయులు, మండల ప్రత్యేక అధికారి, డివైస్ ఓ సుధీర్ రెడ్డి, మండల స్థాయి అధికారులు, స్థానిక గ్రామ సర్పంచ్ గోపాల్, నాయకులు యాదయ్య, ఇతర అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## స్మశాన వాటికలో ఆరడుగుల జాగకు ఆగచాట్లు

- సమాధులు కట్టడం వల్ల కుదించుకుపోయిన స్మశానం
- ఖననం చేయాలంటే మరో శవాన్ని తీయాల్సిందే
- స్పందనకై ఎమ్మెల్యేకి ఇచ్చిన వినతులు చెత్తబుట్టలకేనా?

**వనపర్తి, జూలై 25, (తెలంగాణ వాణి ప్రతినిధి)**
వనపర్తి జిల్లా కేంద్రంలో గతంలో హిందువులకు కేటాయించిన స్మశాన వాటిక పెరిగిన జనాభాకు సరిపోవడం లేదు. పెరిగిన జనాభా కు అనుగుణంగా హిందూ స్మశానవాటిక, ఆర్యవైశ్య స్మశాన వాటిక వెంటనే ఏర్పాటు చేయాలని ప్రజల నుంచి, పార్టీల నుంచి ప్రజా సంఘాల నుంచి, వినతులు వస్తున్న స్పందించని జిల్లా అధికారులు, స్థానిక ఎమ్మెల్యే. దీనితో హిందువుల ఖనన సంస్కారాలకు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం పట్టణంలో పెరిగిన జనాభాకు అనుగుణంగా స్థలం కేటాయించాలి. ప్రస్తుత స్మశానవాటిక స్థలంలో ఖననం కొరకు త్రవ్వగా ఇదివరకే ఖననం చేసిన పుర్రెలు బయట పడుతున్నాయి. గతంలో బి.కృష్ణ, వాకిటి శ్రీధర్, కొమ్మురాములు మాదిగ రాజీవ్ చౌరస్తాలో ఆమరణ నిరాహార దీక్ష చేస్తే శ్రీనివాసపురం శివారులో కొంత స్థలాన్ని హిందూ స్మశాన వాటికకు కేటాయించారు. కానీ ఆ స్థలంలో శవాలను పూడ్చడానికి సరిపోవడం లేదు.అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధులు వనపర్తి జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని గొప్పలు చెప్పు కుంటున్నారు. కానీ ఎవరైనా మరణిస్తే ఆరుఅడుగుల స్థలం లేక ఇబ్బందులు పడే పరిస్థితులు ఏర్పడినది. ఇప్పుడున్న హిందూ శ్మశానవాటికలో కనీస సౌకర్యాలు లేవు. ఆర్యవైశ్యులకు నీటివసతి, మరుగుదొడ్లు, మహిళలు దుస్తులు మార్చుకోనుటకు కావలసిన సౌకర్యాలు లేక ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. వనపర్తి పట్టణంలో పరిసర ప్రాంతాలలో భూముల ధరలు విపరీతంగా పెరిగినందున ప్రయివేట్ స్థలాల్లో ఖనన



సంస్కారాలు చేయనీయడం లేదు. కావున వనపర్తి పట్టణ జనా భాను పరిగణలోకి తీసుకుని నూతనంగా స్మశాన వాటిక ఏర్పాటు చేసి మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

### స్మశానంలో వసతుల కరువు

హిందూ శ్మశాన వాటిక అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. కనీస సౌకర్యాలు లేక అంత్యక్రియలకు ప్రజలు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. ఏళ్లతరబడి పిచ్చిమొక్కలు, ముళ్ల చెట్లతో, చెత్తతో నిండిపోయి ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. దాతలు స్పందించి కొంత అభివృద్ధి చేసినా, ఇంకా చేయాల్సింది చాలా ఉంది. శ్మశాన వాటికకు వెళ్లేందుకు రహదారి కూడా చెత్త చెదారంతో నిండి ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి శ్మశాన వాటికలను అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు. భారీ ఎత్తులో ఉన్న మొక్కలతో శ్మశాన వాటిక చిట్టడవిని తలపి స్తోంది. మున్సిపాలిటీ యంత్రాంగం శ్మశానం దారి అభివృద్ధి చేసి చెట్లు తొలగించాలని, చుట్టూ ప్రహరీ నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

### దహన సంస్కారాలకువేల రూపాయల డిమాండ్

దహన సంస్కారాలకు అక్కడ పని చేసేవారు 20 నుండి 25 వేల



రూపాయల దాకా డిమాండ్ చేస్తుండంతో మధ్య తరగతి వారు పేదవారు అనేక ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. కావున వీటి స్థానంలో విద్యుత్తు దహన యంత్రం ఏర్పాటు చేయవలసిందిగా ప్రజలు కోరుతున్నారు. పెరుగుతున్న జనాభా, పట్టణీకరణ కారణంగా శ్మశాన వాటికలో స్థలం కొరత ఏర్పడి, అంత్యక్రియలు నిర్వహించడం కష్టమవుతోంది.



## ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

- కలెక్టర్ దివాకర్ టీఎస్
- మంచుకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ





**ఖమ్మం, జూలై 25 (తెలంగాణ వాణి):**
ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు నాణ్యమైన, సకాలంలో వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్ అధికారులను ఆదేశించారు. శనివారం రఘునాథపాలెం మండలం మంచుకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి వైద్య సేవలు, సిబ్బంది హాజరు, మందుల నిల్వలు, ల్యాబ్ సేవలు, పరిశుభ్రతను పరిశీలించారు. రోగులతో నేరుగా మాట్లాడి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీసిన కలెక్టర్, అవసరమైన మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచాలని, ల్యాబ్ పరీక్షల నివేదికలను త్వరగా అందించి సకాలంలో చికిత్స అందించాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో విశ్వాసం పెరిగేలా సేవల నాణ్యతను మెరుగుపరచాలని, వైద్యులు, సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. అలాగే ఆసుపత్రిలో పరిశుభ్రత, తాగునీరు, మౌలిక సదుపాయాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ తనిఖీలో తహసీల్దార్ శ్వేత, ఎంపీడీవో అశోక్, సంబంధిత అధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## తాడ్వాయి పోలీస్ స్టేషన్ ను సందర్శించిన జిల్లా ఎస్పీ

- పెండింగ్ కేసుల పురోగతిపై ఆరా ఆన్లైన్ నమోదుపై పరిశీలన
- ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉండాలని అధికారులకు ఆదేశం



**ములుగు, జులై25(తెలంగాణ వాణి):**
ములుగు జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకాన్ వార్షిక తనిఖీల్లో భాగంగా తాడ్వాయి పోలీస్ స్టేషన్ ను సందర్శించి సమగ్ర తనిఖీ నిర్వహించారు. జిల్లాలో పోలీస్ వ్యవస్థ పనితీరు, ప్రజలకు అందుతున్న సేవలపై ప్రత్యక్ష అవగాహన పొందడమే ఈ తనిఖీల ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఈ సందర్శనలో ఎస్పీ మొదటగా పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరంపోలీస్ స్టేషన్ చుట్టూ కలియ తిరుగుతూ పరిసరాల పరిశుభ్రత ను పరిశీలించారు. రోడ్డు ప్రమాద కేసులలో ఉన్న వాహనాల యొక్క పురోగతిని అడిగి తెలుసుకున్నారు అనంతరం రిసెప్షన్ అధికారితో మాట్లాడుతూ ఫిర్యాదారులతో మర్యాదగా వ్యవహరించాలని దరఖాస్తులను ఎప్పటికప్పుడు ఆన్లైన్లో పొందుపరచాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్లో నమోదైన కేసులలో పురోగతిని సమీక్షించారు. ఎప్పటికప్పుడు కేసులలోని దర్యాప్తును వినవెంటనే ఆన్లైన్లో పొందుపరచాలని ఆదేశించారు. అనంతరం రికార్డుల నిర్వహణ విధానం, సిబ్బంది విధి నిర్వహణను పరిశీలించారు. కేస్ రికార్డులను ఎప్పటికప్పుడు అప్డేట్ చేస్తూ ఉండాలని ఆదేశించారు. రౌడీ శీటర్లపైన తీసుకుంటున్న చర్యలపై సమీక్ష నిర్వహించారు. పోలీస్ స్టేషన్కు వచ్చే ప్రజలకు స్నేహపూర్వక వాతావరణం కల్పిస్తూ, వారి సమస్యలను వేగవంతంగా, పారదర్శకంగా పరిష్కరించే విధంగా సేవలు అందించాలని అధికారులను మరియు సిబ్బందికి ఆదేశించారు. ప్రజల్లో పోలీస్ శాఖపై విశ్వాసం పెంపొందించడం ప్రధాన లక్ష్యమని ఎస్పీ పేర్కొన్నారు.

## విద్యార్థుల పోరాట ఫలితమే ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా

- విద్యార్థుల పోరాట స్ఫూర్తితో మరిన్ని ఉద్యమాలు చేపడతాం
- మాల సామాజిక న్యాయ వేదిక ములుగు జిల్లా అధ్యక్షుడు గంపల శివకుమార్

**ఏటూరునాగారం జూలై 25(తెలంగాణ వాణి):**
నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం విద్యార్థుల పోరాట విజయమని మాల సామాజిక న్యాయ వేదిక ములుగు జిల్లా అధ్యక్షుడు గంపల శివకుమార్ పేర్కొన్నారు. నీట్ పేపర్ లీకేజీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గత కొన్ని రోజులుగా దేశవ్యాప్తంగా విద్యార్థులు, వామపక్ష విద్యార్థి సంఘాలు చేపట్టిన ఉద్యమాలు కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర ఒత్తిడి తీసుకువచ్చాయని అన్నారు. విద్యార్థుల ఆందోళనల ఫలితంగానే మంత్రి రాజీనామా జరిగిందని పేర్కొన్నారు. పేపర్ లీకేజీల కారణంగా లక్షలాది మంది విద్యార్థులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురయ్యారని, పరీక్షా వ్యవస్థపై నమ్మకం దెబ్బతిన్నదని అన్నారు. లీకేజీలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడం ద్వారా మాత్రమే ఇటువంటి ఘటనలను అరికట్టవచ్చని సూచించారు. నీట్ పరీక్షల నిర్వహణలో పారదర్శకతను పెంపొందించాలని, విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం తగిన సంస్కరణలు చేపట్టాలని డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం విద్యార్థులను ఏకం చేసి ప్రజాస్వామ్య పద్ధతిలో మరిన్ని ఉద్యమాలు కొనసాగిస్తామని గంపల శివకుమార్ తెలిపారు.

## ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలి: జూపల్లి రమేష్‌బాబు

**ఎస్ఐఆర్ పురోగతిపై తహసీల్దార్‌తో సమీక్ష**

**అశ్వారావుపేట, జూలై 25 (తెలంగాణ వాణి):**
ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం పురోగతిపై అశ్వారావుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్‌బాబు శనివారం తహసీల్దార్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ డి. కిషోర్ మాట్లాడుతూ, అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలో ఎస్ఐఆర్ ప్రక్రియ 86 శాతం పూర్తయిందని, మిగిలిన ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసేందుకు అధికారులు కృషి చేస్తున్నట్లు తెలిపారు. జూపల్లి రమేష్‌బాబు మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు నమోదును పూర్తి చేసుకోవాలని, ప్రజలకు ఇబ్బందులు లేకుండా అధికారులు సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చిన్నంశెట్టి సత్యనారాయణ, బీఎల్ఏ ఇన్‌చార్జి చీకటి శ్రీనివాసరావు, మున్సిపల్ కౌన్సిలర్లు, పట్టణ కాంగ్రెస్ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.






## ప్రధాని మెడలు వంచిన యువత..కేంద్ర మంత్రి రాజీనామా

- యువత పోరాటానికి కాంగ్రెస్ అండ
- రాహుల్ గాంధీ స్ఫూర్తి తో కేంద్రం దిగివచ్చింది.
- కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు

**కరీంనగర్:జులై 25 (తెలంగాణ వాణి)**
నీట్ పేపర్ లీకేజ్ వ్యవహారంలో దేశవ్యాప్తంగా విద్యార్థులు, యువత చేపట్టిన ఉద్యమం ముందు కేంద్ర ప్రభుత్వం తలవంచి కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సి వచ్చిందని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేంద ర్ రావు అన్నారు. ఢిల్లీలో నీట్ పేపర్ లీకేజ్ వ్యవహారంపై పోరాటం చేస్తున్న విద్యార్థులకు మద్దతుగా ఏఐసీసీ పిలుపు మేరకు శనివారం రాత్రి కరీంనగర్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాజీవ్ చౌక్ నుంచి నాకా చౌరస్తా గాంధీ విగ్రహం వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో రాజేందర్ రావు పాల్గొని విద్యార్థుల ఉద్య మానికి సంఘీభావం ప్రక టించారు. అనంతరం నాకా చౌరస్తా వద్ద మీడియాతో మాట్లాడి న ఆయన,దేశంలోని 40 కోట్ల మంది యువత ఒకవైపు,ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మరోవైపు నిలిచిన పరిస్థితి ఏర్పడింద న్నారు. కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరిని ప్రదర్శిం చినప్పటికీ,విద్యార్థులు, యువత వెనక్కి తగ్గకుండా పోరాడారని చెప్పారు. ఆ ఉద్యమానికి కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ సంపూర్ణ మద్దతు ఇవ్వడం తో కేంద్ర ప్రభుత్వం చివరకు దిగివచ్చి కేంద్ర మంత్రి రాజీనామా చేయాల్సి వచ్చిందని పేర్కొన్నారు. 2024,2026 సంవత్స రాల్లో రెండుసార్లు నీట్ పరీక్ష ప్రశ్నాపత్రం లీక్ కావడం కేంద్ర ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు. ఢిల్లీలో నిరసన తెలిపిన విద్యార్థు లపై పోలీసులు లాఠీచార్జి చేయడం దారుణమని,ఆ ఘటనలో ఒక యువతి మృతి చెందగా,అనేక మంది గాయపడి ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనలతో ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రాణాలు కోల్పో యిన బాధితుల కుటుం బాలకు కేంద్ర ప్రభుత్వం రూ.1 కోటి చొప్పున పరి హారం చెల్లించాలని డిమాం డ్ చేశారు. దేశంలోని 40 కోట్ల మంది యువతకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బేషరతుగా క్షమాపణ చెప్పాలని రాజేందర్ రావు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు,కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు,ప్రజా ప్రతినిధులు,మహిళా నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తెలంగాణ వాణి ఎఫెక్ట్

### స్పీడ్ బ్రేకర్లకు మార్కింగ్ చేసిన నేషనల్ హైవే అథారిటీ

**శంకరపట్నం:జూలై 25 (తెలంగాణ వాణి)**
వేగ నిరోధకాలా లేక ప్రమాద కారకాలా? అనే శీర్షికన శుక్రవారం తెలంగాణ వాణి దినపత్రికలో ప్రచురితమైన వార్తకి నేషనల్ హైవే అథా రిటీ అధికారుల నుండివేగంగా స్పందన లభిం చింది. దీంతో కేశవపట్నం అంబేద్కర్ సమీపంలో గల స్పీడ్ బ్రేకర్,తాడికల్ లోని రెండు స్పీడ్ బ్రేకర్లపై లైన్స్ తో మార్కింగ్ చేశారు. తెలంగాణ వాణి మండల ప్రతినిధి స్థానిక రోడ్డు భద్రత అధికారి ఎస్సై కటుకూరి శేఖర్ రెడ్డితో ప్రమాదాల నివారణ కోసం సంప్రదిం పులు జరిపారు. శు క్రవారం ఎన్ హెచ్ ఏ ఐ అధికారులు వార్త వెలువడిన గంటల్లో స్పందించి చర్యలు తీసుకొని స్పీడ్ బ్రేకర్లకు మార్కింగ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడు తూ రోడ్డు పక్కన సైడ్ బర్మ్,సైన్ బోర్డు ఏర్పాటు లకు కృషి చేస్తామన్నారు. దీంతో వాహనదారులు తెలంగాణ వాణి దినపత్రిక కు,రోడ్డు భద్రత అధికారు లకు కృతజ్ఞతలు తెలుపు తూ హర్షం వ్యక్తం చేస్తు న్నారు.




తెలంగాణ వాణి

వేగనిరోధకాలా లేక ప్రమాద కారకాలా?

ప్రమాదాలకు నిలయంగా స్పీడ్ బ్రేకర్లు

epaper.telanganavanidaily.com
24 Jul 2026 - Page 7

## ప్రజాస్వామ్య ఊపిరి - కాక్రోచ్ జనతా పార్టీ



పేరుకే అతిపెద్ద ప్రజాస్వా మ్యం దేశంగా వర్ధిల్లుతున్న ఈ భారతదేశంలో పాలకులు అప్రజాస్వామి కంగా ఈ వ్యవహరిస్తున్న ఘటనలు అనేకంగా చోటుచేసుకుంటూనే ఉన్నాయి. ముఖ్యంగా వైద్య విద్యలో ప్రవేశాల కోసం నిర్వహించే నీట్ పేపర్ లీకేజీకి సంబంధించి నైతిక బాధ్యత వహిస్తూ 'కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయా లి' అంటూ కాక్రోచ్ జనతా పార్టీ నేతృత్వంలో 2026 జూన్ 21 నాడు ప్రారంభమై నెల రోజులకు పైగా నిరవ ధిక నిరసనలు కొనసాగిస్తు న్న తరుణంలో ఎట్టకేలకు ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం శు భపరిణామం. ముఖ్యంగా ప్రజాస్వామి కంగా వ్యవహరించాల్సిన పాలకులు పౌరులు నినదించకముందే సిగ్గుతో తలదించుకొని స్వచ్ఛందం గా దిగిపోవాల్సిన అవసరం ఉన్ననూ వారు ఆ విధంగా వైదొలగిపోవడం లేదు. ముఖ్యంగా చెప్పాలంటే నిజానికి నీట్ పేపర్ లీక్ అయినప్పుడే 'నైతిక బాధ్యత'గా కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సి ఉండాల్సింది. కాని ఆయన యువతరం ఆందోళనలకు తలొగ్గి ఆలస్యంగా అయిననూ అంతిమంగా రాజీనామా చేయడం తద్వారా యువతరం గెలిచి నిలవడమే కాకుండా కొన ఊపిరితో కొట్టుమిట్టాడు తున్న ప్రజాస్వామ్యానికి ఊపిరిపోసింది'అని చెప్పవచ్చు. ఈ గెలుపు ప్రజాస్వామిక రాజకీయాల లో సరికొత్త దశ - దిశను నిర్దేశించింది' అని చెప్పడం లో ఏమాత్రం ఔచిత్యం లేదు.

'కాక్రోచ్ జనతా పార్టీ (సి.జె.పి) వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే నేతృత్వం లో యువతరం విద్యార్థుల సమష్టి పోరాటాలు మరి యు ప్రముఖ పర్యావరణ వేత్త సోనమ్ వాంగ్ చుక్ త్యాగం ఫలితంగానే మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు' అని నిస్సందేహం గా చెప్పవచ్చు. ముఖ్యంగా సోనమ్ వాంగ్ చుక్ 'దీక్షని విరమించండి'అని పౌర సమాజం కోరిననూ,అలాగే పోలీసులు భగ్నం చేసిననూ కుడా ఆయన ఏమాత్రం వెనకడుగు వేయకుండా ఆసుపత్రి నుండి కూడా దీక్షని కొనసాగించి మొత్తం గా ఇరవై ఆరు రోజుల పాటు ఆమరణ నిరాహార దీక్షని కొనసాగించడం ఈ ఉద్యమంలో మైలురాయిగా నిలిచిపోయింది. సోనమ్ వాంగ్ చుక్ దీక్ష భగ్నం అనంతరం జంతర్ మంతర్ లో శాంతియుతంగా దీక్షను కొనసాగిస్తున్న అభిజిత్ దీప్కే సైతం ఒక మహిళ చేత ఏకంగా సిరా దాడికి గురి కాబడిననూ ఆయన ఏమాత్రం బెదరకుండా 'నీలం నా రంగు ... జై భీమ్' అంటూ ముందుకు సాగి పోరాటాన్ని కొనసాగించడా న్ని యువతరం ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరం తప్పకుండా ఉంది. పార్ల మెంట్ ముట్టడి కార్యక్రమం లో ఆందోళనకారులు లాఠీచార్జీ సహా అనేక పోలీసు దాష్టీకాలను అధిగమించి పోరాటాన్ని ముందుకు సాగించడం గొప్ప ముందడుగుగా నిలిచింది. కేంద్ర ప్రభుత్వం ఆందోళన కారులపై అనేక విష ప్రచారాలు వ్యాప్తి చేసిననూ వాటన్నింటిని అధిగమించి ప్రజాస్వామిక బాటలో ఉద్యమిస్తుండ డడం భావి తరాలకు మార్గదర్శిగా నిలుస్తుంది. ఇకనైననూ ఆయా ప్రభుత్వాలు ప్రజా ఆందోళనలను అణచివేయ డం పైననే దృష్టిని కేంద్రీక రించకుండా ఆందోళనకారు ల డిమాండ్లను పరిష్కరి ద్దాం'అనే దిశగా ముందుకు సాగాల్సిన అవసరం తప్పకుండా ఉంది. కాక్రోచ్ జనతా పార్టీ లేవనెత్తిన అన్ని డిమాండ్లను పరిష్కరించేంతవరకు యువతరంతో పాటు ప్రగతిశీల ప్రజాస్వామ్య శక్తులు మరింతగా ఉద్యమించాల్సిన అవసరం తప్పకుండా ఉంది. ఈ సందర్భంగా 'కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి' అంటూ ఉద్యమించి గెలిచి నిలిచిన 'యువతరానికి జేజేలు'తెలియజేస్తు న్నాను.



జె.జె.సి.పి.బాబూరావు
రీసెర్చ్ స్కాలర్
సెల్:94933 19690

## గుమ్మడివల్లి బోనాల వేడుకల్లో నాగ పద్మ, డా. ఉదయజ్యోతి సందడి





**అశ్వారావుపేట జులై 25 (తెలంగాణ వాణి)**
గుమ్మడివల్లి గ్రామంలో బోనాల ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. బీఆర్ఎస్ నాయకురాలు కాసాని నాగశేష పద్మ, 14వ వార్డు కౌన్సిలర్ డా. ఉదయజ్యోతి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోనాల ఊరేగింపులో పాల్గొన్న వారు గ్రామ ప్రజలకు అమ్మవారి ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, మహిళలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులను పరిశీలించిన మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి



**అశ్వారావుపేట జూలై 25 (తెలంగాణ వాణి)**
అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలోని స్థానిక రింగ్ రోడ్ సెం టర్‌లో జరుగుతున్న వాటర్ పై ప్లైన్ పనుల నాణ్యతను పను ల పురోగతిని అశ్వారావుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ బాబు పరిశీలించారు. అలాగే రింగ్ రోడ్ సెంటర్‌లో త్వ రలో ఏర్పాటు చేయనున్న భార త రాజ్యాంగ నిర్మాత, భారతర త్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహ స్థాపనకు సంబంధించిన ఏర్పాట్లనుపరిశీలించి అధికారు లకు తగిన సూచనలు చేశారు. ఈ సందర్భంగా రింగ్ రోడ్ సెం టర్‌లో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు నాణ్యతా ప్రమా ణాలతో, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, నిర్ణీత గడువులో పూర్తయ్యేలా చర్యలు తీసుకో వాలని సూచించారు. ఈ కార్య క్రమంలో అశ్వారావుపేట మండ ల కాంగ్రెస్ నాయకులు జూపల్లి ప్రమోద్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు నండ్రు రమేష్ బా బుపదవ వార్డ్ కౌన్సిలర్ మిండా హరిబాబునక్క సత్య నారాయ ణ,బూసి పాండురంగ అల్లాడి వెంకటరామారావుకర్నాటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## టీఎన్జీఓ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన శాతవాహన బోధనేతర ఉద్యోగుల సంఘం



**కరీంనగర్, జులై 25 (తెలంగాణ వాణి)**
కరీంనగర్‌లో నూతనంగా ఎన్నికైన శాతవాహన యూనివర్సిటీ నాన్-టీచింగ్ స్టాఫ్ (రెగ్యులర్) అసోసియేషన్ సభ్యులు టీఎన్జీఓ రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్, జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాడి హక్కులు సాధించుకోవాలని మారం జగదీశ్వర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్. భీమయ్య, ప్రధాన కార్యదర్శి టీ. రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## వివాహిత ప్రాణాలు కాపాడిన కరీంనగర్ రూరల్ పోలీసులు

**కరీంనగర్:జులై 25 (తెలంగాణ వాణి)**
కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దుర్శేడు గ్రామానికి చెందిన నేతి మానస(23) అనే వివాహి త కుటుంబ కలహాల కారణంగా ఆత్మహత్యాయ త్నానికి పాల్పడ్డారు.?ఈ సమాచారం అందుకున్న కరీంనగర్ రూరల్ ఇన్స్పెక్టర్ నిరంజన్ ఆదేశాల మేర కు,బ్లూకోల్ట్స్ సిబ్బంది అఫ్జల్,హోంగార్డు ప్రసాద్ తక్షణమే సంఘటనా స్థలా నికి చేరుకుని,సమయస్ఫూ ర్తితో వ్యవహరించి ఆమెను సురక్షితంగా కాపాడారు. ?అనంతరం సదరు మహిళ కు కౌన్సిలింగ్ నిర్వహించి, మానసిక ధైర్యాన్ని నింపి సురక్షితంగా కుటుంబ సభ్యులకు అప్పగించారు. క్లిష్ట సమయంలో వేగంగా స్పందించి ఒక అమూల్యమై న ప్రాణాన్ని కాపాడిన బ్లూకోల్ట్స్ సిబ్బంది అఫ్జల్ హోంగార్డు ప్రసాద్‌లను ఏసీపీ విజయకుమార్,సీపీ గౌస్ ఆలం ప్రత్యేకంగా అభినందించారు.

Printed, Published & Owned by JERIPOTHULA SAMPATH, Printed at SRI BALAJI, H.No. 4-4-85, Tilak road, District Karimnagar. 505 001 (T.S)Published at H.No. 3-6-307, Subhash Nagar, Karimnagar MDI: District, Karimnagar -505 001 (T.S) Editor: JERIPOTHULA SAMPATH, RNI NO. APTEL/2012/53127 CELL:9912758107, telanganavanil@gmail.com